ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0

హైవే ప్రమాదాలపై పరిశీలన

ఏలూరు క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ప్రమాదాలు తగ్గించేందుకు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు జాతీయ రహదారుల వెంబడి శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించి లోపాలను పరిశీలించారు. జిల్లాలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించి బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు ఏ కారణం చేత జరుగుతున్నాయో అక్కడ ఉన్న లోపాలు ఏమిటో పరిశీలించేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యూజే విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞ, ఇంజనీర్ నాగేశ్వరరావు, సిబ్బంది శుక్రవారం రహదారులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్టు గుర్తించారు. వీటిలో అసమాన ఉపరితలాలు, తగిన డివైడర్లు లేకపోవడం వల్ల ప్రమాదాలకు కారకాలుగా మారాయని గుర్తించారు. లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలపై దృష్టి సారించారు. ప్రమాద సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు వంటి భద్రతా సూచనలు అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు తగ్గించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాతో సమన్వయం కలిగి తగిన మార్గదర్శకాలను రూపొందించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.


జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు





వరలక్ష్మీ పాహిమాం..

వరాలివ్వు తల్లీ వరలక్ష్మీ అంటూ మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇంటింటా వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి విగ్రహాలను కొలువు తీర్చి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొని కుంకుమార్చనలు చేశారు. భీమవరంలోని మావుళ్లమ్మను అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ద్వారకాతిరుమల క్షేత్రదేవతగా విరాజిల్లుతున్న కుంకుళ్లమ్మ శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

శుభవార్త

- నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్
- మంత్రివర్గం ఆమోదంతో హర్షం

ఏలూరు రూరల్/ఏలూరు టూటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గతంలో నాయీ బ్రాహ్మణులకు టీడీపీ ప్రభుత్వం ఉచితంగా పనిముట్లు అందించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ వాటికి స్వస్తి చెప్పింది. తాజాగా టీడీపీ ప్రభుత్వం 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించడంతో నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. షాపులు నిర్వహించే వారికి నెలకు సుమారు రూ.1200 నుంచి రూ.1300 ఆదా అవుతుందని పేర్కొంటున్నారు. జిల్లాలో సుమారు 350 నుంచి 400 వరకు సెలూన్ షాపులున్నాయి. ఉచిత విద్యుత్ అమలుతో నెలకు సుమారు రూ.4.5 లక్షల వరకు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.


ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు ప్రభుత్వం 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడం ఆనందంగా ఉంది. విద్యుత్ బిల్లులు కట్టలేక చాలా మంది షాపులు మూసివేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నాయీ బ్రాహ్మణులకు అండగా నిలబడిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. 2019లో అప్పటి సీఎం చంద్రబాబు నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్‌పై జీవో తెచ్చినప్పటికీ అమలు చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలం అయ్యింది. కూటమి ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌ని కేవలం నాయీ బ్రాహ్మణ సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే అమలు చేయాలి.

- తాతపూడి చందు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం యువజన అధ్యక్షుడు

వాగ్దానాలు నెరవేర్చారు..



కులవృత్తులు చేసుకునే నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయం. దేవ స్థానాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు వేతనాన్ని పెంచుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రభుత్వం నెరవేర్చింది. దేవాలయాల పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులను సభ్యులుగా నియమించడానికి జీవో జారీ చేయడం సంతోషదాయకం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు.

- సీహెచ్.నందీశ్వరరావు, ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



నేడు ఏపీ నిట్ స్నాతకోత్సవం

- ప్రతిభావంతులకు బంగారు పతకాలు .. విద్యార్థులకు డిగ్రీ పట్టాల ప్రదానం

ముక్కలైన డివిజన్.. ఒక్కటి కానుందా?

లోపలి పేజీలో..


మండవల్లి పీహెచ్‌సీ ఆవరణలో సంచరిస్తున్న పశువులు

హా..సుపత్రి!

అన్నింటా అంతులేని నిర్లక్ష్యం..

ఆంధ్రజ్యోతి విజిట్

- ఓ వైపు వైద్యులు.. మరోవైపు టెక్నీషియన్ల కొరత
- పేషంట్లకు అందుతున్న సేవలు అంతంతే..
- పనిచేయని ఫ్యాన్లు, ఏసీలు
- అత్యవసరమైతే చాలు.. రిఫర్
- నూజివీడు వార్డులో.. వైట్ బుక్
- ఆసుపత్రి అభివృద్ధి కోసం చందాలకట..!
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో నమ్మలేని నిజాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

అన్నీ ఉన్నా.. ఏదో అన్నట్లుగా వుంది ప్రభుత్వాస్పత్రుల తీరు. ఏ ఆస్పత్రికి వెళ్లినా ఏదో సమస్య కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆస్పత్రుల తీరు మెరుగుపడలేదు. డాక్టర్ల కొరత వెన్నాడుతోంది. కొన్నిచోట్ల రోగులకు పరీక్షలు చేయాలన్న ఆ తరహా పరిస్థితే మచ్చుకైనా కనిపించలేదు. అత్యవసరమైతే పక్కాగా వందలు చెల్లించి పరీక్షలు చేయించుకోవాల్సిందే. ఎమర్జెన్సీ వార్డుల్లో ఏసీలు పనిచేయవు. వార్డుల్లో గాలికి పనికి రాని ఫ్యాన్లు కనిపిస్తాయి. వార్డుల్లో హెచ్‌వోడీల దర్శనం ఓ భాగ్యం. కిందస్థాయి అసిస్టెంట్లతోనే సరిపెట్టుకోవాల్సిందే. ఎక్కడా లేనట్లుగా నూజివీడులో తల్లీ బిడ్డల సంరక్షణ వార్డులో ఏకంగా వైట్ బుక్ తెరిచారు. అభివృద్ధి, సంక్షేమంటూ ఏ పేషంట్ అయినా ఆ బుక్‌లో కొంత చెల్లించినట్టు లిఖిత పూర్వకంగా నమోదు చేయవచ్చు. అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రులకు అంబులెన్స్‌లో వైద్యానికి వెళితే చాలు.. క్షణాల్లో అక్కడి నుంచి వేరే ఆస్పత్రికి రిఫర్ చేస్తూ పంపేస్తారు. ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ పరిధిలోని ఆస్పత్రిలో సీటులో రోగులకు అందుబాటులో కనిపిం చేది వేళ్లపై లెక్కించే వారే. ప్రభుత్వాసుపత్రిలో తాజా పరిస్థితులను గమనించేం దుకు గురు, శుక్రవారాల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ నిర్వహించింది.

నూజివీడులో చేతులు తడపాల్సిందే

నూజివీడు టౌన్ : రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తి చేసుకున్న నూజివీడు ఏరియా ఆసుపత్రి నూతన భవనంలో ఎట్టకేలకు ఇటీవల వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. మొత్తం 23 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ఏడు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పూర్తిస్థాయి సదుపాయాలు లేక రోగులు నిలువు కాళ్ళ మీద నిలబడక తప్పని పరిస్థితి. సాధారణ రోజుల్లో 250కి పైబడి అవుట్‌పేషెంట్లు నమోదు అవుతుండగా, సోమవారం 400 నుంచి 500 మంది వరకు ఓపీ నమోదవుతోంది. లేబర్ వార్డు (సీమాంక్, ప్రసూతి) విభాగంపై పలు ఆరోపణలు రోగుల నుంచి వినిపిస్తున్నాయి. కాన్పుల విషయంలో ఇక్కడ కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు చేతులు తడపాలని, ఆడపిల్ల పుడితే ఒక రేటు, మగపిల్లవాడు పుడితే మరో రేటు కింద వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. వీల్‌చైర్లు, స్ట్రెక్చర్లు ఉపయోగించేందుకు సైతం డబ్బులు వసూలు చేస్తున్నారని, డొనేషన్ బుక్ పేరుతో సైతం ఈ వసూళ్లు సాగుతున్నాయంటూ నూజివీడు ఐద్వా కమిటీ అధ్యక్షురాలు నండూరి పద్మాంజలి, ఐద్వా నాయకులు బొబ్బిలి కుమారి ఆరోపించారు. దీనిపై సూపరింటెండెంట్ పద్మజారాణిని వివరణ కోరగా డబ్బుల వసూలు తన దృష్టికి రాలేదని, విచారించి చర్యలు చేపడతానన్నారు. ప్రమాదాల ఘటనలో విషమంగా ఉన్న రోగులను విజయవాడకు రిఫర్ చేస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద 110 శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు.

చింతలపూడిలో వేధిస్తున్న డాక్టర్ల కొరత

చింతలపూడి: చింతలపూడి ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 23 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. వచ్చిన డాక్టర్లు ఏదొక నెపంతో డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆస్పత్రిలో గత సామాజిక ఆస్పత్రిగా ఉన్నప్పటి సౌకర్యాలే తప్ప అదనంగా ఒనగూరినవి ఏవీలేవు. రోజుకు పదికి పైగా ఎమర్జెన్సీ కేసులు వస్తుంటాయి. మెరుగైన చికిత్సకు ఏలూరు, విజయవాడ, గుంటూరు తరలిస్తుంటారు. కేవలం ఎక్సరే సౌకర్యం మాత్రమే ఉంది. స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలకు పరికరాలు లేవు. పేరుకు వంద పడకలు. ఇందులో 20 పడకలకే ఇన్ పేషెంట్లకు, 10 పడకలు మెటర్నటీ వార్డు కోసం వినియోగిస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు సివిల్ సర్జన్ లేక అవి కూడా పెద్దగా జరగడం లేదు. 2011లో వైద్యనిధి నిధులతో అప్పటి కలెక్టర్ వాణీప్రసాద్ రూ.18 లక్షలతో పలు వైద్య పరీక్షల కోసం పరికరాలు అందించారు. అవి ఎక్కడ ఉన్నాయో కాని వినియోగించడంలేదు. పార్కింగ్ స్థలం లేదు. తగిన ఫర్నీచర్ లేక వృద్ధులు ఓపిలో కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 300లకు పైగా అవుట్ పేషెంట్లు వస్తుంటారు. డాక్టర్లు లేక పేషెంట్లు వెనక్కి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వంద పడకల ఆసుపత్రి భవనాలు **(మిగతా 8వ పేజీలో)**



నిరుపయోగంగా ఉన్న ఎస్‌బీఎస్‌యూ రూమ్

జంగారెడ్డిగూడెంలో సమస్యల తిష్ట

జంగారెడ్డిగూడెం : ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలకు ముఖ్యమైన జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ ట్రామా కేర్ సదుపాయం లేక ప్రమాదాల బాధితులకు ఎమర్జెన్సీ వైద్య సేవలు అందడం లేదు. ఏలూరు, విజయవాడ, గుంటూరు రిఫర్ చేస్తున్నారు. ఎమర్జెన్సీ సమయంలో వచ్చిన పేషెంట్‌లను ముఖ్యమైన పరీక్షలకు స్థానికంగా ఉన్న ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. రాత్రివేళ వచ్చే పేషెంట్‌ల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఈ ఆస్పత్రిలో ఒకే ఒక ఆర్థోపెడిక్ డాక్టర్ ఉన్నారు. ఆయన నిత్యం సదరం క్యాంపుల పేరుతో వెళ్లిపోతుంటారు. ఎముకల డాక్టర్ అందుబాటులో ఉండడం లేదని ఇక్కడకు వచ్చిన రోగులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్ సర్జరీలు చేయడం లేదు. చిన్నపిల్లల వైద్యులు ఇద్దరు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరూ లేరు. దీంతో ఎస్‌బీఎస్‌యూ రూమ్ నిరుపయోగంగా ఉంది. ఓపీ నమోదుకు ఆరు కౌంటర్లు పెట్టినా ఆధార్ నమోదు వల్ల ఎక్కువ సమయం పడుతుండడంతో రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఎక్స్‌రే విభాగంలో రెగ్యులర్ రేడియో గ్రాఫర్ లేకపోవడంతో డిప్యూటేషన్‌పై గోపాలపురం నుంచి రేడియోగ్రాఫర్ ఇక్కడకు వస్తున్నారు.పోస్టుమార్టం షెడ్డు పూర్తయినా సదుపాయాలు లేని పాత భవనాన్నే ఉపయోగిస్తున్నారు.

పేరుకే పెద్దాస్పత్రి.. వైద్య సేవల్లో అథమం

ఏలూరు క్రైం : మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి మహర్దశ పడుతుందని, అన్ని సూపర్‌స్పెషాల్టీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ఇక్కడ నుంచి రోగులు వేరే ఆస్పత్రులకు వెళ్లే పరిస్థితే ఉండదని రిఫరల్ అంటూ పెరగవని అధికారులు, ప్రజా ప్రతినిధుల ప్రకటనలతో అంతా నమ్మారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో మెడికల్ కళాశాల 2023 ఏప్రిల్ 26న అధికారంగా ఎంబీబీఎస్ 150 అడ్మిషన్లతో ప్రారంభమైంది. మరోవైపు ఏలూరు ప్రభుత్వాస్పత్రిని సర్వజన ఆస్పత్రిగా మార్పు చేశారు. అయితే ఆస్పత్రిలో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. వైద్యులు, సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు అందుబాటులో ఉండాల్సిందే. అత్యవసర విభాగంలో, వార్డుల్లో 24 గంటలు అందు బాటులో ఉండాలి. కాని ఉదయం 9 గంటలకు కొంతమంది వైద్యులు ఎఫ్ఆర్ఎస్‌తో ఫొటో దిగి ఆ తర్వాత కన్పించడం లేదు. సిబ్బందిది ఇదే దారి. ల్యాబ్‌లో సిబ్బంది కొరత, మౌలిక వసతులు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర విభాగం నుంచి ప్రతి రోజు ఎక్కువ కేసులు విజయవాడకు రిఫరల్ చేస్తున్నారు. తల్లి బిడ్డల విభాగంలో సేవలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అక్కడకు వెళ్ళితే కుట్లు వేసిన తర్వాత అవి విడిపోతున్నాయని, ఇన్‌ఫెక్షన్స్ వస్తున్నాయని అంటున్నారు. గతంలో ఆసు పత్రిలో 70 వరకు ఏసీలు కొనుగోలు చేసినా కొన్ని ఏసీలను మరమ్మతుల నిమిత్తం పీకేశారు. తర్వాత ఏర్పాటు చేయలేదు. సర్జికల్ వార్డులో ఒకే ఒక బాత్‌రూమ్ పని చేస్తోంది. ఆస్పత్రిలో తరచుగా నీటి ఎద్దడి ఎదురవుతోంది. వార్డులలో కిటికీలకు దోమ తెరలు లేవు. సిబ్బంది కొరతతో రోగి బంధువులే పేషెంట్లను స్ట్రెక్చర్లపైన, వీల్ చైర్‌లలో తీసుకువెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. మందులన్నీ సమృద్ధిగా ఉన్నప్పటికీ న్యూరో విభా గానికి సంబంధించిన గబాపెంటిన్ 300 ఎంజి టాబ్లెట్స్ నెలరోజులకు పైగా అందుబాటులో లేక రోగులు బయట కొనుగోలు చేసుకుంటున్నారు. ఆసుపత్రిలో సూపరింటెండెంట్, నలుగురు డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఇద్దరు ఆర్ఎంవోలు ఉన్నప్పటికీ సాధారణంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, మెడికల్ సర్టిఫికెట్లు, ఇతర మెడికల్ సర్టిఫికెట్లు పొందేందుకు వీరు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి.


సెప్టిక్ వార్డులో పాడైపోయిన ఏసీ

భూ లెక్కలు పక్కాగా!

- మూడో విడత భూముల రీ సర్వే ప్రారంభం
- మొదటి, రెండో విడతల్లో పైలట్ ప్రాజెక్టుగా 82 గ్రామాల్లో సర్వే పూర్తి
- నవంబరు నాటికి సరిహద్దుల గుర్తింపు షురూ
- డిసెంబరు నాటికి పట్టా భూముల లెక్కలు పూర్తి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రైతుల ప్రయోజనం, ప్రవేట్ వ్యక్తుల భూములకు వివాదాలకు మోక్షం దిశగా ప్రభుత్వం భూముల రీ సర్వేను పక్కాగా చేస్తోంది. ఏడు నెలలు కాలంలో రెండు విడతలుగా ఎంతో పురోగతి సాధించగా, చివరి దశలో అన్ని భూముల లెక్కలను పక్కాగా తేల్చాలని డిసెంబర్ నెలాఖరుకు డెడ్‌లైన్ విధించింది. ఈ దిశగా రెవెన్యూ, సర్వేశాఖల అధికారులు,సిబ్బంది పావులు కదుపుతున్నారు.

జిల్లాలో భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీలైనంత త్వరలోనే మొదటి, రెండో విడతల్లో పైలైట్ గ్రామాలుగా చేపట్టిన 82 గ్రామాల్లో భూముల సమాచారాన్ని పక్కాగా ఉంచాల్సిందేనంటే ఆదేశాలు జారీ చేసింది. దీనికి తోడు మూడో విడతలో విభిన్నంగా ప్రతీ మండలంలోని ప్రస్తుతం మిగిలిన గ్రామాలన్నింటిల్లోనే సర్వే చేస్తారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో భూముల సరిహద్దుల గుర్తింపును నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత ప్రభుత్వ భూములు, అటు తర్వాత మిగిలిన పట్టాల భూముల లెక్కలను డిసెంబర్ నాటికి తేల్చాలని లక్ష్యాలను నిర్దేశించింది. మొత్తం మీద ఏడాది కాలంలోనే భూముల అన్ని సమస్యలకు ప్రభుత్వం చెక్‌పెట్టేలా అడుగులు వేస్తోంది. తొలి విడతగా పైలట్ ప్రాజెక్టుగా భూముల రీ సర్వే ప్రక్రియకు ఈ ఏడాది జనవరి 26న అంకురార్పణ జరిగింది. గత ప్రభుత్వ తప్పిదాలను సవరిస్తూ రైతులకు సత్వర ప్రయోజనం చేకూర్చే దిశగా ఇప్పటికే రెండు విడతలుగా జరిగిన భూముల రీ సర్వేను రాష్ట్ర ప్రభుత్వ భూపరిపాలనశాఖ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల చూసి వెళ్లారు. మూడో విడతను ప్రారంభించాలని ఆదేశించగా, ఆ దిశగా మిగిలిన అన్ని గ్రామాల్లో సరిహద్దులు గుర్తింపుపై కసరత్తులు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన తప్పిదాలతో ఇటీవల జాయింట్ ఎల్‌పీఎంల వల్ల రైతులు క్షేత్రస్థాయిలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటిని సరి చేయడంతో మూడో విడతకు కార్యరంగంలోకి రెవెన్యూ, సర్వేశాఖల అధికారులు గ్రామాల వైపు తొంగి చూస్తున్నారు. దీంతో ఒక్కొక్కటిగా గ్రామాల్లో భూముల వ్యవహారాల్లో తప్పులు, లోటుపాట్లు, ఇక్కట్లను ప్రభుత్వశాఖలు సమన్వయంతో సరిచేస్తున్నారు. కాగా ప్రభుత్వ సూచనలతో భూముల రీసర్వేలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భూముల వరీకరణకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక మ్యాప్‌లతో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలకు వెళ్లాలని భూముల రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉండాలని సీసీఎల్‌ఏ సూచనలు చేస్తూనే ఉన్నారు.


భూముల రీ సర్వే చేస్తున్న సిబ్బంది

146 గ్రామాల్లో ప్రారంభించాం..

'జిల్లాలో మూడో విడత భూముల రీ సర్వే కింద 258 గ్రామాల్లో సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, ఇప్పటి వరకు 146 గ్రామాల్లో ప్రారంభించాం. మొత్తం 146 గ్రామాల్లో పూర్తి చేశాం' అని ఏలూరు జిల్లా ల్యాండ్ సర్వేశాఖ ఏడీ అన్సారీ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనే ప్రభుత్వ భూముల లెక్కింపును నవంబరు 30 నాటికి పూర్తి చేస్తామన్నారు.

పగలు ఎండ..రాత్రుళ్లు వాన

- జిల్లాలో విభిన్న వాతావరణం
- సార్వా సాగుపై ప్రభావం

ఏలూరుసిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న వాతావరణం ఏర్పడింది. నైరుతి రుతు పవనాలు పూర్తిగా మందగించడంతో అడపాదడపా మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడన ద్రోణి, ఉపరితల ఆవర్తనాలు వచ్చినా వర్షం జాడ లేకుండా పోయింది. అయితే మూడు రోజులుగా వాతావరణం విభిన్నంగా మారింది. రాత్రి సమయంలో మబ్బులు ఏర్పడి వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. పగలు ఎండ తీవ్రత వేసవిని తలపించే విధంగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడి పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. నారుమళ్లు ఎండిపోతే వరి నాట్లు ఏ విధంగా వేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని చెబుతున్నారు. ఆగస్టులో వర్షపాతం ఎక్కువగా ఉండేదని ఇప్పుడు పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. జూన్‌లో వర్షాలు కొంత బాగున్నా, జూలైకు వచ్చే సరికి సాధారణం కన్నా తక్కువగానే వర్షపాతాలు నమోదయ్యాయి. ఆగస్టు ప్రారంభం నుంచి అసలు వర్షాల జాడే కనిపించకపోవడంతో వరి, మొక్కజొన్న, అపరాలు, మిర్చి, వేరుశనగ, నువ్వులు, పత్తి, చెరకు పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జిల్లాలో 2లక్షల 45వేల ఎకరాల్లో సార్వా సాగులో వరితో పాటు ఇతర పంటల సాగు జరుగుతోంది. ఈనెల 13న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందన్న సమాచారం రైతుల్లో కొంత ఆనందం కలిగిస్తోంది.

జిల్లాలో గత 24 గంటల్లో అత్యధికంగా ముసునూరు మండలంలో 59.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 14.4 మి.మీ నమోదైంది. ముదినేపల్లిలో 56.8, టి.నరసాపురం 42, కలిదిండి 39.2, లింగపాలెం 31.4, పెదవేగి 28.2, నూజివీడు 26.2, కొయ్యల గూడెం 16.4, వేలేరుపాడు 14, చింతలపూడి 13.2, ద్వారకా తిరుమల 11.2, జీలుగుమిల్లి 9.6, బుట్టాయిగూడెం 8.4, కామవరపుకోట 8.2, పెదపాడు 6.4, ఏలూరు అర్బన్ 5.2, చాట్రాయి 4.8, కైకలూరు 4, జంగారెడ్డిగూడెం 2.8, భీమడోలు 2.4, కుక్కునూరు 2 మి.మీ వర్షపాతాలు నమోద య్యాయి. జిల్లాలో ఇంకా వర్షం కురిసిన రెండు మండలాల్లో 2 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతాలు నమోదయ్యాయి.



ఎస్సీ కాలనీ జలమయం

పోలవరం : పోలవరం మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పట్టిసీమ ఎస్సీ కాలనీ పూర్తిగా జలమయమైంది. డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షం కురిసిన ప్రతిసారి కాలనీ మొత్త జలమయమవుతోందని అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



9 లక్షల గాజులతో మావుళ్లమ్మకు అలంకారం

నేడు, రేపు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనం



భీమవరం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం శుక్రవారం, వరలక్ష్మి వత్రం సందర్భంగా మావుళ్ళమ్మకు గాజులతో అలంకరించారు. భక్తులు దాదాపు 9 లక్షల గాజులను అలంకారం నిమిత్తం అందించారు. వచ్చిన గాజులను ప్రత్యేకంగా దండలుగా తయారుచేసి గురువారం రాత్రి నుంచి అలంకారం చేశారు. రంగు రంగుల గాజుల కాంతులతో అమ్మవారు దేదీప్యమానంగా కనిపించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ సంప్రోక్షణ కార్యక్రమాలను చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్ ఏర్పాట్లును పర్యవేక్షించారు. శనివారం, ఆదివారం కూడా అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులు దర్శనం ఇవ్వనున్నారు.

రూ.11 లక్షల విలువైన బంగారు పుష్పాలు బహూకరణ

త్వరలో మావుళ్ళమ్మ అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. అజ్ఞాత భక్తులు సుమారు 11 లక్షల విలువ చేసే 108 బంగారు పుష్పములను అమ్మవారికి బహూకరించారు. అంజిబాబు చేతుల మీదగా ఈవోకు వీటిని అందించారు. అమ్మవారి స్వర్ణ వస్త్ర నిధికి దాతలు ముందుకు వస్తున్నారన్నారు.మరో 25 కేజీలు బంగారం వస్తే వస్త్రం పూర్తి అవుతుందని ఈవో తెలిపారు. పొతూర్తిబాపిరాజు, చలమల చంద్రశేఖర్, కోళ్ళ నాగేశ్వరరావు, బొండాడ భూషణం, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, చిన్ని పాల్గొన్నారు.



గర్భాలయ ద్వారాలకు వెండి తొడుగు

కైకలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో కల్పిస్తున్న వసతులతోనే భక్తుల సంఖ్య పెరుగు తుం దని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆల యానికి 20 మంది దాతల సహకారంతో 16 కేజీల వెండితో అమ్మవారి గర్భాలయ తలు పులకు ఏర్పాటు చేసిన వెండి తొడుగును పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమన్నారు. కైకలూరుకు చెందిన పిచ్చుకల నాగేశ్వర రావు, పి. పవన్‌కాంత్ 4 కేజీల వెండి సింహాన్ని ఆల యానికి అందించడం అభినందనీయమన్నారు. అలాగే ఆలయంలో కొలువైయున్న శ్రీపార్వతీ సమేత కనకలింగేశ్వర స్వామికి వెండి నాగా భరణాన్ని 4 కేజీలతో భుజబల పట్నానికి చెందిన ఎం. కొండరాజు చేయిస్తారని ఎమ్మెల్యే వెల్లడించారు. తలుపులకు వెండి తొడుగులు అందించిన 20 మంది దాతలను ఎమ్మెల్యే సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, కోకన్వీనర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వెండి తొడుగుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్



పవిత్రాధివాసంలో భాగంగా పంచగవ్య ప్రోక్షణ జరుపుతున్న అర్చకులు, రుత్వికులు

నేత్రపర్వం..చిన్న వెంకన్న పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్ర వారం ఆలయంలో జరిగిన పవి త్రాధివాసం భక్తజనులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అర్చకులు, రుత్వికులు వైభవంగా జరిపారు. అనం తరం పవిత్రాలకు పంచగవ్య ప్రోక్షణ, అభి మంత్రణలను నిర్వహించారు. ఆ తరువాత ఉత్సవ మూర్తుల వద్ద పవిత్రాలను ఉంచి పంచ శయనాది వాసాన్ని వేదమంత్రోచ్ఛరణలతో అర్చక స్వాములు జరిపారు. అనంతరం మహా శాంతి హోమాలు జరిగాయి. ఆలయంలో చతు ర్వేద పారాయణ నిర్వహించారు.



సరిపల్లెలో వేద పఠనం చేస్తున్న పండితులు

వేదాలను రక్షించుకోవాలి

గణపవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వేదాలు లోక కల్యాణానికి ఉపయోగపడతాయని పలువురు వేదపండితులు అన్నారు. గణపవరం మండలం సరిపల్లెలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న 105వ శాస్త్ర పరిషత్ కార్యక్రమాలు రెండోరోజు శుక్రవారం వేద పరీక్షల్లో వేద విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ వేదాన్ని వ్యాస మహర్షి నాలుగు వేదాలుగా విభజించారని రుగ్వేదం దేవతల గొప్పతనం తెలుపుతుందని, యజుర్వేదం మానవుని పుట్టుక నుంచి మరణం వరకు చేపట్టాల్సిన కర్మలను తెలియజేస్తుందని, అదర్వణ వేదం యాంత్రిక విద్యను తెలుపుతుందని, సామవేదం సంగీత ప్రధానమైందని వివరించారు. మనదేశం ఈ నాలుగు వేదాలతో వేదభూమిగా యజ్ఞ యాగాదులతో కర్మభూమిగా, ధానధర్మాలతో పుణ్య భూమిగా, రుషి పుంగవులతో తపోభూమిగా వర్ధిల్లుతోంది. భారతీయ సనాతన ధర్మానికి వేదమే ప్రమాణం.

వేద పురుషుడు శ్రీమన్నా రాయణుడు, వేద మాత గాయిత్రీదేవి సకల ప్రాణులను రక్షిస్తుంటారు. వేదాలను పఠించే బ్రహ్మణోత్తములను భూలోక దేవతలంటారు. సనాతన ధర్మానికి ప్రతీకలైన వేదాలను రక్షించు కోవడం అటు పాలకులు, ఇటు ప్రజలపైన ఉందని వేద పండితులు స్పష్టం చేశారు. పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ నెల 9వ తేదీ శనివారం ఆఖరిరోజు వేదశాస్త్ర పరిషత్ సభలో శ్రీగాయిత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో యోగ్యాత పత్రాలతో సన్మానించి, సత్కరిస్తారు.

తోబుట్టువు తోడుగా..



సోదర సోదరీమణుల బంధానికి ప్రతీక రక్షా బంధన్

నేడు రాఖీ పండుగ

ద్వారకాతిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తోబుట్టువుల మధ్య ప్రేమాను రాగాలకు చిహ్నంగా ప్రతీ ఏటా శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ పండుగ జరుపుకుంటారు. శనివారం రాఖీ పండుగ సందర్భంగా సోదర, సోదరీమణులు మధ్య ప్రేమ, అనురాగాలకు ప్రతీకగా రాఖీ కడతారు. అనంతరం సోదరుల నుంచి బహుమతులు స్వీకరిస్తారు.రాఖీ కట్టడం వల్ల తమ సోదరుడు తమకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని నమ్ముతారు. శక్తి స్వరూపిణిగా వ్యవహరించే ఇంటి ఆడపడుచు చేత రక్షాబంధన చేయిస్తే సోదరులకు దేవతలు సైతం రక్షణగా నిలుస్తారని అరిష్టాలు తొలగిస్తారని విశ్వాసం.

పురాణాలు ఏం చెబుతున్నాయి ?

హిందూ ధర్మంలో ఏమి చెప్పినా దానికి విశేషమైన ఆంతర్యం ఉంటుంది. లక్ష్మీదేవి, చంద్రుడు ఇద్దరూ క్షీరసముద్రం నుంచి ఉద్భవించారు. శ్రావణంలో వరలక్ష్మీదేవిని పూజిస్తాం. శ్రావణ పౌర్ణమి తిథికి చంద్రుడు అధిదేవత. లక్ష్మీదేవికి, చంద్రుడికి మధ్య ఉన్నది సోదర, సోదరీమణుల సంబంధం.. ఒకే కడుపు నుంచి బయటకు వచ్చినవారు శ్రావణ మాసంలో సోదరి తన సోదరునికి రాఖీ కడుతుంది. రాఖీ పండుగ రోజున లక్ష్మీ నారాయణుని పూజించి రాఖీ కడితే శుభ ఫలితాలు దక్కుతాయని పండితులు చెబుతున్నారు.



ఎన్ని ముడులు వేయాలి ?

రాఖీ పౌర్ణమి రోజున సోదరి తన సోదరునికి రాఖీ కట్టేడప్పుడు మూడు ముడులు మాత్రమే వేయడం శుభప్రదమంటున్నారు పండితులు. అందులో మొదటి ముడి తన సోదరుడి దీర్ఘాయుష్షు ప్రసాదిస్తుందని, రెండోముడి రాఖీ కట్టిన సోదరికి దీర్ఘాయుష్షునందిస్తుందని, ఇక మూడో ముడి వారి అనుబంధంలో మాధుర్యాన్ని పెంచుతుందని నమ్మకం.

రాఖీ ఎప్పుడు కట్టాలి ?

శాస్త్రాల ప్రకారం భద్రకాలంలో రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. భద్రకాలం ముగిసిని తర్వాతే రాఖీ కట్టాలి. జ్యోతిష్యం ప్రకారం రాఖీ పౌర్ణమి వేళ మూడు శుభయోగాలు ఏర్పడనున్నాయి. సర్వార్థ సిద్ధి యోగం, శోభన్‌యోగం, సౌభాగ్యయోగం వంటివి ఏర్పడతాయని వారు చెబుతున్నారు. ఈ ఏడాది శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి ఆగస్టు 8 మధ్యాహ్నం 2.12 ని.లకు ప్రారంభమవుతుంది. మరుసటి రోజైన ఆగస్టు 9న మధ్యాహ్నం గం.1.24లకు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో పంచాంగం ప్రకారం భద్రకాలం శనివారం తెల్లవారుజామునే ముగుస్తుంది. సోదరీమణులు రక్షాసూత్రాన్ని తమ సోదరుని మణికట్టుపై శనివారం మధ్యాహ్నం పౌర్ణమి ఘడియలు ముగిసేలోపు ఎప్పుడైనా కట్టొచ్చు. శనివారం ఉదయం 5.47 నుంచి మధ్యాహ్నం గం. 1.24 వరకూ శుభసమయం ఉందని పండితులు చెబుతున్నారు.



భీమవరం జ్యువెలరీ దుకాణంలో



వెండి, బంగారం రాఖీలు

అందుబాటులో ధరలో ఉండటంతో కొనుగోళ్లు

భీమవరం క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం, మరుసటి రోజే రాఖీ పౌర్ణమి కూడా రావడం వల్ల బంగారం మార్కెట్‌లు కళకళలాడాయి. బంగారం దుకాణాలు కొనుగోలు దారులతో సందడి నెలకొంది. ఈ ఏడాది ఇమిటేషన్, వెండి రాఖీలతో పాటుగా బంగారం రాఖీలు కూడా అందుబాటులో ఉండటంతో కొందరు వాటిని కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు. రూ. 10 వేల నుంచి రూ. 12 వేలు విలువ చేసే గ్రాములోపు ఉన్న బంగారం రాఖీలు ఎక్కువుగా విక్రయించినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది అయితే వెండి రాఖీలు భారీ ఎత్తున కొనుగోలు చేసినప్పటికీ ఈ ఏడాది బంగారం రాఖీలపై కూడా కొందరు శ్రద్ధ చూపిస్తున్నారు. సోదరుడికి ఎంతో ఇష్టంగా ప్రేమతో బంగారంతో కూడిన రాఖీని కడితే ప్రేమ మరింత పెరుగుతుందన్న భావనతో కొందరు మహిళలు చెబుతున్నారు. వెండి రాఖీలు రూ. 700, రూ. 800, రూ. 1000, ఆ పైన ధరలకు విక్రయించారు. భీమవరంలో రాఖీల కొనుగోలు దారులతో శుక్రవారం ఉదయం నుంచి మార్కెట్లు కళకళలాడాయి.

అమ్మకాలు అంతంతమాత్రమే..

ఆన్‌లైన్ మార్కెట్ దెబ్బకు రిటైల్ డల్

భీమవరం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) ఆనందోత్సవాలతో జరుపుకునే రక్షాబంధన్ పండుగలో రాఖీల అమ్మకాలు లేక వ్యాపారాలు తీవ్ర నిరాశ చెందారు. గత కొద్దికాలంగా అమ్మకాల జోరు తగ్గుతూ వస్తోంది. ప్రతీ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయిలు జరిగే రాఖీల వ్యాపారం ప్రస్తుతం లక్షల్లో జరుగుతోంది. ఆన్‌లైన్ వ్యాపారం రావడంతో స్థానిక మార్కెట్‌లో అమ్మకాలు తుగ్గుతూ వస్తున్నాయి. దీంతో పాటుగా స్మార్ట్ ఫోన్లలో ఫొటోలతో తయారు చేసుకుని పంపుకోవటంతో రాఖీల కొనుగోలు తగ్గిపోయిందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఎక్కువగా రూ.5 నుంచి రూ.100 దరలో ఉన్న రాఖీల అమ్మకాలు బాగున్నాయని అంటున్నారు. ఈ సీజన్‌లో గురువారం, శుక్రవారం మాత్రమే కొనుగోళ్లు కొంత కనిపిస్తున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. గతంలో లక్షల రూపాయల వరకు రాఖీల అమ్మకాలు జరిగేదని ప్రస్తుతం సగం వ్యాపారం జరగలేదని భీమవరం వ్యాపారి ఒకరు చెప్పారు. రాఖీల కొనుగోలులో వెండి రాఖీల అమ్మకాలు కొంత బాగున్నాయని చెబుతున్నారు. రూ. 100 నుంచి రూ.1000 వరకు ఉన్నాయని మామూలు వాటి కంటే వీటి అమ్మకాలు పర్వాలేదని చెబుతున్నారు.



భీమవరంలో రాఖీల విక్రయాలు

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

అమ్మవారి ఆలయాలు కిటకిట..

భీమవరం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వరలక్ష్మీ వత్రాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకారం చేసి పూజలు చేసుకున్నారు. కొత్తగా పెళ్ళి చేసుకున్న కోడలితో అత్తింటివారు పుట్టింటిలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి పూజను చేయించి బంగారు వస్తువును అందించారు.ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు. అమ్మవారిని 9 రకాల పూలతో అలంకరించడంతో పాటు 9 రకాల పండ్లు, 9 రకాల పిండి వంటలను నివేదించారు. ఇళ్లవద్ద వ్రతాలు చేసి అనంతరం అమ్మవార్ల ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భీమవరం మావుళ్ళమ్మ ఆలయం, శ్రీరాంపురంలోని శ్రీచక్రసహిత కనకదుర్గ అమ్మవారి ఆలయం, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం, తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయాలతో పాటు ఏలూరు జిల్లాలోని కుంకుళ్లమ్మ తదితర అమ్మవారి ఆలయాలు భక్తులతో కిలకిటలాడాయి. భక్తులకు ఇబ్బందులు రాకుండా అధికారులు పర్యవేక్షించారు.





మావుళ్లమ్మ ఆలయం వద్ద భక్తుల క్యూ..

వరలక్ష్మీ వ్రత పూజలు చేస్తున్న మహిళలు



భీమవరం మావుళ్ళమ్మ దేవాలయం వద్ద భారీగా నిలిచిన వాహనాలు

భీమవరంలో ట్రాఫిక్..ట్రాఫిక్..

గంటలకొద్దీ నిలిచిపోయిన వాహనాలు

భీమవరం క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సాయంత్రం నుంచి ట్రాఫిక్ రద్దీ భారీగా పెరిగింది. ముఖ్యంగా మావుళ్ళమ్మ దేవస్థానం సమీపం నుంచి రెస్ట్‌హౌస్ రోడ్, సింహాద్రి అప్పన్న దేవాలయం రోడ్, వెంకయ్య నాయుడు వీధి, తటవర్తి వారి వీధి, తాడేరు రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మావుళ్ళమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు కార్లలో వచ్చి కార్లు ఎక్కడ పార్క్ చేయాలో తెలియక అడ్డదిడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. శ్రావణ శుక్రవారం కావడం వల్ల మావుళ్ళమ్మను దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భారీగా భక్తులు వాహనాల్లో వచ్చారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు మాత్రం కనబడకపోవడంతో కొందరు అసహనం వ్యక్తం చేశారు. ఇంత ట్రాఫిక్ ఉన్నా కూడా పోలీసులు క్రమబద్ధీకరించకుండా ఏం చేస్తున్నారంటూ ప్రశ్నలు వెల్లువెత్తాయి. వాహనదారులు అవస్థలు పడ్డారు. దేవాలయం వద్ద మాత్రమే బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ దేవాలయం రోడ్డులోకి వెళ్ళే వాహనాలు మలుపు తిరిగేందుకు వీలు లేకపోవడంతో అక్కడ కూడా ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నది. ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పలువురు కోరుతున్నారు.

అడవి దాటని అభివృద్ధి

మారని ఆదివాసీల తలరాతలు



అందని ద్రాక్షగా మెరుగైన వైద్యం

నేటికీ పాకల్లోనే చదువులు..బురద రోడ్లపై పాట్లు

నేడు ఆదివాసీ దినోత్సవం

బుట్టాయగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో మానవుడు గ్రహాంతరాలను, భూమండలాన్ని చుట్టేస్తుండగా ఏజెన్సీ ఆదివాసీల తలరాతలు నేటికి మారక పోగా గిరిజన గూడేలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. అటవీ ఫలాలు, పోడు వ్యవసాయాలపైనే ఆధారపడి ఆదివాసీలు జీవితాలను నెట్టుకొస్తున్నారు. వ్యవసాయ భూములుండి పంటలు సాగుచేస్తున్న గిరిజనులు అతి తక్కువ మంది ఉండగా అధికులు కూలి పనులపైనే ఆధారపడ్డారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు చేస్తున్న కృషి అంతంత మాత్రం ఫలితాలనే ఇస్తుందనే వాదనలు లేకపోలేదు. ఫలాలను అందించడంలో అధికారులు, పాలకుల మధ్య చిత్తశుద్ధి కొరవడిందనే విమర్శలు లేకపోలేదు. ఆదివాసీ బిడ్డల బాగోగులు చూడటానికి ఏజెన్సీ కేంద్రంగా కేఆర్ పురంలో 1986లో ఏర్పాటు చేసిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) నామమాత్రంగా మారిందనే విమర్శలు వినవస్తున్నాయి. నేడు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

అందని ద్రాక్షగానే మెరుగైన వైద్యం

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ బిడ్డలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారింది. సర్కారీ వైద్యంపై చాలామంది ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించాలని పార్టీలు, ప్రజా,గిరిజన సంఘాలు ఆందోళనలు చేయని రోజు లేదు. అయినా పాలకులకు పట్టదు. వైద్యసేవలను మెరుగుపరచి మెరుగైన వైద్యం అందించడానికి చేపట్టిన ఆసుపత్రుల అభివృద్ధి పనులు నిధుల లేమితో పడకేశాయి. అల్లికాలువ వద్ద కోల్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు, బుట్టాయగూడెం, దొరమామిడి ఇతర ప్రాంతాల్లో ఆసుపత్రుల నిర్మాణాల పనులు మందగించాయి.

నేటికి పాకల్లోనే కొనసాగుతున్న విద్య

ఏజెన్సీ ప్రాంతంలో విద్య నేటికీ పాకల్లో కొనసాగుతోంది. పలుచోట్ల నిర్మాణాలు చేపట్టిన భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో భవనాలు పాతబడిపోయి ప్రమాదకరంగా మారాయి. భవనాల పరిస్థితులు ఇలా ఉంటే నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. మోతుగూడెం కాలనీ, లక్ష్మడుగూడెం ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలకు భవనాలు మంజూరు కాకపోవడంతో గ్రామస్తులే పాకలను ఏర్పాటు చేసుకుని తరగతులు నడిపించుకుంటున్నారు.

అధ్వానంగా రోడ్ల పరిస్థితి

రోడ్ల సమస్య మన్యం వాసులను వెంటాడుతోంది. అటవీ ప్రాంతాల్లోని అనేక గూడేలకు సరైన రోడ్డు మార్గం లేదు. వర్షాలు కురుస్తున్నందున కొండరెడ్డి గ్రామాలకు వెళ్ళే రోడ్లన్నీ బురదగా మారి ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయంటూ కొండరెడ్లు గగ్గోలు పెడుతున్నారు. అడుగడుగునా గోతుల మయంగా తయారైన బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారికే ఇప్పటివరకు మోక్షం లేదు. అనేక ప్రంతాల్లో కొండవాగులు ఆది వాసీలను ప్రమాదాల భారిన పడేలా చేస్తున్నాయి. అత్యవసరమైన ప్రాంతాల్లో కొండవాగులపై వంతెనలు నిర్మించాలని వేడుకుంటున్నా పాలకుల చెవులకెక్కడం లేదని ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయవలసిన ఐటీడీఏ నిధుల లేమితో కొట్టుమిట్టాతుంది. గతంలో విద్య, వైద్యం, వ్యవసాయ సహాయం, వ్యవసాయ పరికరాలు, వ్యక్తిగత యూనిట్లు, రుణాలు, ట్రాక్టర్లు, ఎండ్లబండ్లు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, కిరాణా షాపులు, ఇతర దుకాణాలు ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణం, ఉన్నత విద్యకు చేయూత, వైద్య ఖర్చులు పలు రకాలుగా ఐటీడీఏ ఆది వాసీలకు అండగా ఉండేది. ఐటీడీఏకు వెళితే తప్పకుండా సహాయం అందుతుందని సుదూర ప్రాంతాల నుంచి గిరిజనులు వచ్చేవారు. నేడు ఐటీడీఏకు వస్తే చార్జీలు దండగ అనేలా ఉందని వాపోతున్నారు.



పొంగుతున్న కొండవాగుల వద్ద జనాలు పడిగాపులు



మోతుగూడెం కాలనీలో పాఠశాల నడిచేది ఈ పాకలోనే..

- **పాలకులకు చిత్తశుద్ధి లేదు**



ఆదివాసీల అభివృద్ధిపైన, సమస్యల పరిష్కారంలో అధికారులకు, పాలకులకు చిత్తశుద్ధి కొరవడింది. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాలయాలకు వెళ్ళి వినతిపత్రాలు ఇవ్వడం తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇచ్చిన అర్జీలన్నీ ఏమైపోతున్నాయో తెలియడం లేదు. జీవో నెం.3 పునరుద్దరణకు కృషి చేయాలని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆందోళన చేసినా కదలిక లేదు.

పి.శ్రీనివాస్, న్యూడెమోక్రసీ నాయకుడు

- **పోరాటాలు చేసినా స్పందన కరువు**



ఏజెన్సీలో అధికారులు, నేతలు ఉన్నా లేనట్టుగానే ఉంది. పార్టీలు, ప్రజా సంఘాల తరఫున పలుమార్లు సమస్యలపై అధికారులకు విన్నవించినా పరిష్కారం అందని ద్రాక్షగానే ఉంది. విద్య, వైద్యం, రోడ్లు, భూములు, పట్టాలు, గిరిజన చట్టాలు, హక్కుల కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నాం. ప్రత్యేక డీఎస్సీ కోసం ధర్నాలు, ర్యాలీలు ఆందోళనలు చేసినా స్పందన లేదు.

తెల్లం రామకృష్ణ, సీపీఎం నాయకుడు

విద్యుత్ అదనపు లోడుకు రాయితీతో అవకాశం

డిసెంబరు నెలాఖరు వరకు గడువు పెంపు

భీమవరంటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులకు ఏపీఈపీ డీసీఎల్ మరో అవకాశాన్ని ఇచ్చింది. మరో 4 నెలలపాటు రాయితీతో అదనపు లోడు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది.గత మార్చి నెల నుంచి జూన్ నెలాఖరువరకు గతంలో అవకాశం ఇచ్చినా అనుకున్నంత స్పందన రాకపోవడంతో మరో అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకుంటే కిలోవాట్‌కు 2,250 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఐతే ఈ రాయితీ పథకంలో దరఖాస్తు చేసుకుంటే రూ.1250 చెల్లిస్తే సరిపోతుంది. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 3,596 మంది అదనపు లోడు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో కూడా ఇంచుమించు ఇదే సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది.

అదనపు లోడు వివరాలు ఇవీ

కిలో వాట్స్	అసలుధర	రాయితీ
కిలో వాట్‌కు	2250	1250
2 కిలోవాట్లకు	4450	2450
3 కిలోవాట్‌కు	6650	3650
4 కిలోవాట్‌కు	8850	4850
5 కిలోవాట్‌కు	11050	6050



తణుకు ఎస్‌కెఎస్‌డీ కళాశాలలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు

తణుకు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లాస్థాయి ఎంపికలను శుక్రవారం ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వ హించారు. కబడ్డీ 12 మంది, ఖోఖో 15 మంది, వాలీబాల్ 12 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆయా టీమ్‌ల నుంచి 70 క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్పోర్ట్సు డవలప్‌మెంట్ ఆఫీసర్ మల్లి రాజేష్ చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కూటమి నాయకులు వావిలాల సరళాదేవి, బొల్లా నాగరాజు తదితరులు పరిశీలించారు.



ఆకలి పోరాటం..!

ఊరూ పేరు లేని అభాగ్య జీవితాలు వారివి.. కడుపు నింపుకునేందుకు వారికి తెలిసిన పని ఇదొక్కటే.. మనం తిని పారేసిన చెత్తలో వారు జీవనాన్ని వెతుక్కుంటున్నారు.. రోడ్లపై చెత్తా చెదారాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల, కాగితాలు ఏరుకుని వాటిని అమ్ముకుని పొట్టపోసుకుంటుంటారు సంచార జీవులు.. మోకాళ్ళ లోతు డ్రెయినేజీలో దిగి చేతులతో ఏదైనా దొరుకుతుందేమోనని తడుముతూ వెతుకులాడడం చూస్తుంటే ఛీ..ఛీ అంటూ అసహ్యించుకునేవారే ఎక్కువ.. కానీ వారిది ఆకలి పోరాటం.. గుప్పెడు మెతుకుల కోసం నిత్యం వారు చేసే సాహస కృత్యం.. పెనుగొండలోని రాజుగూడెం శివారులో ఉన్న డ్రెయినేజీలో ఇదిగో ఇలా ఇద్దరు మహిళలు ఆ రోజు పొట్ట పోసుకునేందుకు బతుకు పోరాటం చేస్తున్నారు..



-పెనుగొండ(ఆంధ్రజ్యోతి)



శిథిలావస్థలో ఉన్న పెంకుటింట్లో ఆర్‌అండ్‌బీ ఏఈఈ కార్యాలయం

ఇదీ.. ఒక కార్యాలయమే..!

పెంటపాడు ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి కష్టమొచ్చింది. ఎప్పుడు పడిపోతుందో తెలియని శిథిలావస్థలో ఉన్న పెంకుటిల్లే కార్యాలయానికి ప్రస్తుత చిరునామా.. పట్టణంలోని ట్రావెలర్స్ బంగళాలలో ఆర్డీవో, ఆర్‌అండ్‌బీ డీఈ కార్యాలయాలకు మంచి భవనాలే కేటాయించారు. కానీ ఆర్‌అండ్‌బీ ఏఈ కార్యాలయానికి మాత్రం శిథిలావస్థలో ఉన్న పెంకుటిల్లు ఇచ్చారు. ఈ పెంకుటింటి భవనం పైకప్పు రెండు భాగాలుగా చీలిపోయింది. ఎప్పుడు పడిపోతుందో కూడా తెలియని పరిస్థితి. ఉద్యోగులు కూడా బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నారు. పని నిమిత్తం వెళ్ళే ప్రజలు, కాంట్రాక్టర్లు కూడా ఈ కార్యాలయాన్ని చూసి భయపడుతున్నారు. అధికారులు స్పందించి మంచి భవనం కేటాయించాలని కోరుతున్నారు.

- పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

నేడు ఏపీ నిట్ స్నాతకోత్సవం

ప్రతిభావంతులకు బంగారు పతకాలు .. విద్యార్థులకు డిగ్రీ పట్టాల ప్రదానం



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్ 7వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. శనివారం ఉదయం 10 గంటల నుంచి నిట్ ప్రాంగణంలోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఈ వేడుకను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టణంలో ఏపీ నిట్‌ను 2015 లో ఏర్పాటు చేయగా ఇప్పటివరకు నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులను ఏడు బ్యాచ్‌ల విద్యార్థులు పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం 2021-25 బ్యాచ్‌కు చెందిన 667 మంది విద్యార్థులు ఏపీ నిట్‌లో డిగ్రీలను తీసుకోనున్నారు. వీరితో పాటూ పీహెచ్‌డీ పూర్తి చేసిన 29 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నారు. సంస్థలో మొత్తం 8 కోర్సులను నిర్వహిస్తుండగా ఆయా కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కొక్క విద్యార్థికి ఇనిస్టిట్యూట్ తరపున బంగారు పతకాన్ని ప్రదానం చేయనున్నారు.

ముఖ్యఅతిథి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్

ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న హాజరు కానున్నారు. వేడుకలను సంబంధించిన ఏర్పాట్లను నిట్ అకడమిక్ డీన్ డాక్టర్ జయరాం పర్యవేక్షిస్తున్నారు.

బంగారు పతకాలు వీరికే..

కోర్సుల వారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు బంగారు పతకాలను అందుకోనున్నారు. బయో టెక్నాలజీ ఇంజనీరింగ్ నుంచి శశాంక్ (9.33 గ్రేడ్ పాయింట్లు), కెమికల్ ఇంజనీరింగ్ నుంచి సంగెపు అభినవ్ (8.82), సివిల్ ఇంజనీరింగ్ నుంచి తమ్ము హరిత (9.44), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నుంచి కలిదిండి పవన్ తేజ సత్యవర్మ (9.70), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ నుంచి ఆదిత్య ప్రతాప్ సింగ్ (9.42), ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నుంచి చిత్తిడి ధనూషా లక్ష్మి దుర్గ (9.48), మెకానికల్ ఇంజనీరింగ్ నుంచి వుడుముడి ప్రియాంక (9.33), మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ నుండి జయస్మిత కే ప్రధాన్ 9.07 గ్రేడ్ పాయింట్లు సాధించారు. వీరంతా నేడు జరిగే స్నాతకోత్సవంలో బంగారు పతకాలను అందుకోనున్నారు. బ్యాచ్‌లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన పవన్ తేజ సత్యవర్మ ఇనిస్టిట్యూట్ తరఫున, కోర్సు వారీగా రెండు బంగారు పతకాలను అందుకోనున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు అందించే ప్రశంసా పత్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

నిర్బంధంగా 'విద్యా శక్తి' తగదు

ఏలూరు రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యా శక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఏలూరులో జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు స్టీవెన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిజేశారని, కానీ కొన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహించమనడం సబబు కాదన్నారు. సాధారణంగా విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటలకు మానసికంగా అలసిపోతారని, ఆ సమయంలో విద్యాశక్తి అని అదనంగా తరగతులు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారంతో పాటు బోధనేతర కార్యక్రమాలు భారం తగ్గించి బోధనకు మాత్రమే పరిమితం చేస్తేనే మంచి ఫలితాలుంటాయన్నారు. అకడమిక్ ఫోరంలు తప్పనిసరయితే సీనియర్ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలన్నారు. అసెస్మెంట్ బుక్స్‌లో మార్కులు ఎందుకు వేశారో కారణాలు రాయమనడం విడ్డూరమన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా పీఆర్సీ డీఏల ఊసెత్తకపోవడం సరికాదన్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ అధ్యక్షత వహించారు.



నూజివీడు నియోజకవర్గ మ్యాప్

ముక్కలైన డివిజన్.. ఒక్కటి కానుందా?

» జిల్లా మార్పునకు శ్రీకారంపై ప్రజల్లో హర్షం » నూజివీడు వాసుల్లో చిగురిస్తున్న ఆశలు

వైసీపీ ప్రభుత్వం చేసిన జిల్లాల మార్పులు, చేర్పులతో రాష్ట్రంలో అనేక జిల్లాల వాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనాలోచిత చర్యల వల్ల సుదీర్ఘకాలం నుంచి ఉన్న డివిజన్‌లు సైతం కుంచించుకుపోవడం, కొన్ని నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు తరలివెళ్లిపోయి డివిజన్, నియోజకవర్గాల ప్రాధాన్యం తగ్గిపోయింది. అలా ప్రాధాన్యత కోల్పోయిన డివిజన్ నియోజక వర్గాల్లో నూజివీడు ఒకటి.

(ఆంధ్రజ్యోతి - నూజివీడు)

ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు ఉన్నప్పుడు కృష్ణా జిల్లాలోని 14 మండలాలతో అతిపెద్ద డివిజన్‌గా నూజివీడు ఉండేది. మరోవైపు ఉమ్మడి కృష్ణా జిల్లాలో దాదాపు మధ్యస్థంగా ఉండడంతో డివిజన్‌కు అత్యధిక ప్రాధాన్యం లభించేది.

మూడు ముక్కలైన నూజివీడు డివిజన్

జిల్లాల విభజనతో 14 మండలాలతో ఉన్న నూజివీడు డివిజన్ దాదాపు మూడుముక్కలు అయింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో పూర్వపు నూజివీడు డివిజన్‌లోని మండలాలు కలిశాయి. పూర్వపు డివిజన్‌లో నూజివీడు నియోజకవర్గంలో గల నాలుగు మండలాలు ఏలూరు జిల్లా కేంద్రంగా ఉన్న నూజివీడు డివిజన్‌లో ఉండగా, మిగిలిన పది మండలాల్లోని కొన్నింటిని ఎన్టీఆర్ జిల్లా పరిధిలో తిరువూరు డివిజన్‌ను ఏర్పాటు చేయగా, మరికొన్నింటిని గుడివాడ డివిజన్‌లో విలీనం చేశారు.

నాలుగు మండలాలతో కుదేలు

గత ప్రభుత్వం నిర్ణయం వల్ల 14 మండలాల నూజివీడు డివిజన్ నాలుగు మండలాలకు కుదించబడింది. దీంతో సేల్స్ ట్యాక్స్ కార్యాలయం, ఉద్యానవన పంటలకు కేంద్రంగా ఉన్న నూజివీడు నుంచి ఉద్యానవన సహాయ సంచాలకుల కార్యాలయం, పౌర సంబంధాల శాఖ కార్యాలయాలు ఏలూరుకు తరలాయి. ఈ పరిస్థితుల్లో నూజివీడు డీఎస్పీ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాలు సైతం నిబంధనల ప్రకారం తరలిపోయే ప్రమాదం పొంచి ఉండడంతో నాటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అప్పటి సీఎం జగన్‌ను కలిసి విన్నవించడంతో నాడు పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం మండలాలను నూజివీడు డివిజన్‌కు కలపడంతో పాటు పెదపాడు, పెదవేగి మండలాలను నూజివీడు పోలీస్ డివిజన్‌లో కలిపారు. ఆయా మండల వాసులకు నూజివీడులో కలవడం ఇబ్బందికరంగా మారింది. నూజివీడు రెవెన్యూ డివిజన్ 6 మండలాలైంది. నూజివీడు ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్నప్పుడు డివిజన్ మెట్ట ప్రాంతం కావడంతో జిల్లాలో ప్రాధాన్యం ఉండేది. నూజివీడు ఏలూరు జిల్లాలో కలపడం వల్ల ఆ జిల్లాలో ఒక మారుమూల ప్రాంతంగా ఉండడం, అప్పటికే ఆ జిల్లాలో మెట్ట ప్రాంతంగా ఉన్న జంగారెడ్డిగూడెంకు ఉన్న ప్రాధాన్యం నూజివీడుకు లేదనే చెప్పాలి.

సీఆర్‌డీఏపై కక్షతోనే..

జగన్ ప్రభుత్వం సీఆర్‌డీఏ పరిధిలో చుట్టూ ఉన్న డివిజన్‌లను, జిల్లాలు మార్చి సీఆర్‌డీఏని దెబ్బతీసే భాగంలోనే నూజివీడును ఏలూరు జిల్లాలో కలిపారనేది నగ్నసత్యం. ఇప్పుడు నూజివీడు నియోజకవర్గం సీఆర్‌డీఏలో ఉంది. అవుటర్ రింగ్ రోడ్డు నియోజకవర్గ పరిధిలోని ఆగిరిపల్లి మండలం నుంచి వెళుతోంది. అవుటర్ రింగ్ రోడ్డు పూర్తయితే నియోజకవర్గం అభివృద్ధికి బాటలు పడినట్లే.

రెండు సార్లు బాబు హామీ

చంద్రబాబు ప్రతిపక్షనేతగా నూజివీడు రెండుసార్లు వచ్చారు. వచ్చిన ప్రతిసారి నియోజకవర్గ ప్రజలు తమ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల హామీగా ఆయన ఎన్నికల ప్రచార సభకు వచ్చినప్పుడు చంద్రబాబు సభాముఖంగా విజయవాడ జిల్లా కేంద్రంగా ఉన్న జిల్లాలో నూజివీడును చేర్చుతానని హామీ ఇచ్చారు. సీఎం అయిన తర్వాత ఆగిరిపల్లి పీ-4 కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన దృష్టికి ప్రజలు ఈ విషయాన్ని మరోసారి తీసుకురాగా తనకు గుర్తు ఉందంటూ ఆయన పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు, డివిజన్ కేంద్రాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని వేయడం, ఎంతవరకు వచ్చిందని బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అడగడం, నెల రోజులలో దీనిపై నివేదిక ఇవ్వాలని డిసెంబరు నాటికి సమస్యకు పరిష్కారమయ్యేలా చర్యలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేయడంతో నూజివీడు నియోజక వర్గంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

ద్వారకాతిరుమల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అందాల్సిన రేషన్‌బియ్యాన్ని అక్రమార్కులు పక్కదారిపట్టిస్తున్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్టు సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. తరలింపునకు సిద్ధంగా ఉన్న అక్రమ రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టుకుని సీజ్ చేసింది. మండలంలోని జి.కొత్తపల్లిలో మాటూరి దుర్గయ్య అనేవ్యక్తి దాసరి రాజు ఇంట్లో గదిని అద్దెకు తీసుకుని అందులో 3,750 కేజీల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడు. గ్రామాల్లో లబ్దిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వచేసి వాటిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈక్రమంలో కొత్తపల్లిలో దీనిని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు తాళ్లూరి నాగరాజు, జంగారెడ్డిగూడెం డీటీ వెంకటేశ్వరరావు, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. దుర్గారావుపై కేసు నమోదు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

గడ్డివాము దగ్ధం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి గడ్డివాము దగ్ధం కావడంతో రైతులిచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోణంగి గ్రామానికి చెందిన జలసూత్రం సోమేశ్వరరావు తన రెండెకరాల పొలంలోని వరి గడ్డిని గడ్డివాముగా వేశారు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. ఈ సంఘటనపై సోమేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో పొడుచుకున్నాడు..

ఏలూరు క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి బీరు సీసాతో గాయపరుచుకున్నాడు. పత్తేబాదకు చెందిన అరుణ్ కుమార్ వంట మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 7న మద్యం మత్తులో బీరు సీసాతో పొడుచుకున్నాడు. స్థానికులు గుర్తించి సర్వజన ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా చికిత్స పొందుతున్నాడు. దీనిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రొయ్యలు కొనుగోలు చేసి మోసం

భీమవరం క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తనవద్ద రొయ్యలు కొనుగోలు చేసి డబ్బులివ్వకుండా ఇద్దరు మోసం చేశారంటూ లిఖిత మెరైన్ ఫుడ్స్ అండ్ ఎల్ఎన్ఆర్ మెరైన్ ఫుడ్ సంస్థల మేనేజింగ్ పార్టనర్ లింగం నాగేశ్వరరావు వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావు చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతుల నుంచి రొయ్యలు కొనుగోలు చేసి వాటిని ఐస్ ప్యాకింగ్ చేసి ఎక్స్‌పోర్ట్ చేస్తుంటారు. ఇదిలా ఉండగా 2024లో గోవా రాష్ట్రానికి చెందిన మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్ర సింగ్ జారి, డైరెక్టర్ పీయూష్ రాజేంద్ర సింగ్ జారి భీమవరం వచ్చి లింగం నాగేశ్వరరావు నుంచి రొయ్యలు అరువుకి కొనుగోలు చేశారు. విదేశాలకు విక్రయిస్తామంటూ నమ్మించి 2024-25 సంవత్సరం మధ్యకాలంలో మూడు దఫాలుగా కోటి 35 లక్షల 34 వేల 907 రూపాయల విలువైన రొయ్యలు కొనుగోలు చేశారని అన్నారు. అరువు కావడంతో వడ్డీతో సహా చెల్లిస్తామని నమ్మబలికి ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకుండా మోసం చేసినట్టు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కట్నం కోసం వేధిస్తున్నవారిపై కేసు

భీమవరం క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తన భర్త తరపు బంధువులు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ భీమవరం పట్టణానికి చెందిన గోడి అనిత వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనితకు సుమారు ఆరేళ్ల క్రితం రాజమహేంద్రవరం మండలం మారెంపూడి గ్రామానికి చెందిన జాషువా జయకుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5 లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చారు. కొంత కాలం బాగానే ఉన్నారని ఆ తర్వాత జాషువా జయ కుమార్, అతని బంధువులు రూ.10 లక్షలు అదనంగా కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్టు ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆయిల్‌పాం గెలలు కోస్తూ కూలీ మృతి



రమేశ్ మృతదేహం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తాడువాయి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంలో ఓ రైతు పొలంలో ఆయిల్‌పాం గెలలు కోయడానికి వెళ్లిన తడికమళ్ళ రమేష్(35) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం గ్రామానికి చెందిన రమేష్ కూలీ పనులు చేసుకుంటూ భార్య, కుమార్తెను పోషించుకుంటున్నాడు. జంగారెడ్డిగూడెం మండలం గొల్లగూడెం లో వీరంకి శ్రీనివాసరావుకు చెందిన ఆయిల్‌పాం తోటను కొప్పుల శ్రీనివాసరావు కౌలుకు తీసుకున్నారు. శుక్రవారం రమేశ్‌ను కొప్పుల శ్రీనివాసరావు ఆయిల్‌పాం గెలలు కోయడానికి కూలికి పిలిచాడు. రమేశ్ గెలలు కోస్తుండగా కత్తి విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య చుక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. జబీర్ తెలిపారు.

రిటైర్డ్ మిలటరీ ఉద్యోగిపై చీటింగ్ కేసు

● ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.49.50 లక్షలు స్వాహా

ఏలూరు క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఒక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఒక మహిళను పరిచయం చేసుకుని ఆమె ద్వారా బంధువుల వద్ద లక్షలాది రూపాయలు తీసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశాడు. దీంతో ఆ మహిళ, బాధితులు కలిసి ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ కేసు నమోదు చేశారు. ఏలూరు ఆర్ఆర్ పేటకు చెందిన సాలమూరి వెంకట నాగ శ్రీలక్ష్మి గృహిణిగా ఉంటూ తన కుటుంబంతో జీవిస్తుంది. ఆమె సోదరుడి ద్వారా తాడేపల్లిగూడేనికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి జాలాది రామచంద్రరావు పరిచయమయ్యాడు. తనకు మంత్రులు తెలుసని అనేక శాఖల ఉన్నతాధికారులు తెలుసునని నమ్మబలికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పాడు. శ్రీలక్ష్మి తన కుటుంబ సభ్యులతో పాటు తన బంధువుల్లో ఉన్న నిరుద్యోగ యువతకు పరిచయం చేయడంతో వారి నుంచి రూ.49 లక్షల 50 వేలు 2023 నుంచి ఇప్పటి వరకూ తీసుకున్నాడు. ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు. మాయమాటలు చెప్పి కాలయాపన చేస్తున్నాడు. దీంతో నాగ శ్రీలక్ష్మి బాధితులు కలిసి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రాత్రి రామచంద్రరావుపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాములదిబ్బ ప్రాంతంలో ఇల్లు దహనం

● పాత కక్షల నేపథ్యంలో ఉద్రిక్తత, రంగంలోకి దిగిన పోలీసులు



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పాములదిబ్బలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. రెండు నెలల క్రితం పాములదిబ్బకు చెందిన ముంగి యర్రబాబు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అదే ప్రాంతానికి చెందిన కొందరు నిందితులుగా ఉండడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆ సమయంలోనే బాధిత కుటుంబ సభ్యులు నిందితుల ఇంట్లో సామగ్రి ధ్వంసం చేసి హడావుడి చేయడంతో అప్పట్లో పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా డీఎస్పీ శ్రావణ్‌కుమార్ చర్యలు చేపట్టారు. అప్పట్లో విషయం సర్దుమణిగినా నివురు గప్పిన నిప్పులా రాజుకుంటూ ఉంది. క్రమంలోనే శుక్రవారం తెల్లవారు జామున హత్య కేసులో నిందితుడిగా ఉన్న దాసరి కుమార్ రాజ్ ఇంటికి నిప్పు పెట్టారు. దీంతో మళ్లీ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. శాంతి భద్రతలు గాడితప్పకుండా టూటౌన్ సీఐ అశోక్ కుమార్ పాములదిబ్బలో మళ్లీ పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. ఇంటికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి హత్యకు గురైన యర్రబాబు తల్లి పెద్దింట్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నారాయణపురంలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై ఉంగుటూరు మండలం నారాయణపురం వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీ కొనడంతో మోటార్ సైకిలిస్టుతో పాటు పాదచారి గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది వివరాల ప్రకారం నారాయణపురంలో మెకానిక్ షెడ్డులో పని చేస్తున్న కైకరం గ్రామానికి చెందిన కోనే పవన్ మోటారు సైకిల్‌పై వేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న వేముల ఉమామహేశ్వరరావును ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. వైద్యం నిమిత్తం వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాద ఘటనా స్థలంలో షంషేర్ మృతదేహం

యాసిడ్‌తో వెళ్తున్న ఆటో బోల్తా.. మహిళ మృతి

పెదపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):ట్రక్కు ఆటోలో యాసిడ్ తీసుకొస్తుండగా టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.పెదపాడు మండలం తాళ్ళమూడి వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. గుంటూరుకు చెందిన షేక్ అల్లాబక్ష్, అతని భార్య బేగ్ షంషేర్(45)లు తమ ప్రాంతంలో యాసిడ్ కొనుగోలు చేసి తిరిగి ఏలూరులో అమ్మకాలు చేస్తుంటారు. ఇదేక్రమంలో శుక్రవారం గుంటూరులో యాసిడ్ కొనుగోలు చేసి దానిని డబ్బాల్లో నింపుకుని ట్రక్కు ఆటోలో పెట్టుకుని ఏలూరుకు బయల్దేరారు. ఆటో తాళ్ళమూడి వద్దకు వచ్చేసరికి టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తా పడింది. దీంతో క్యాబిన్‌లో ఉన్న భార్య, భర్తలిద్దరిపై యాసిడ్ పడింది. దీంతో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన ఎస్.ఐ. కట్టా శారదా సతీష్ దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



భీమవరం క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో జంక్షన్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెంబర్ 2లో నరసాపురం నుంచి లింగంపల్లి వెళ్లే రైలు కింద సుమారు 55సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి తల పట్టాలపై పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకుని పరిశీలించారు. వివరాలు తెలిస్తే 97056 49492 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఆత్మహత్య చేసుకుంటానన్న వ్యక్తికి కౌన్సెలింగ్

కైకలూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగాలేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటున్నానని బంధువులకు చెప్పడంతో 112 కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అలర్ట్ అయ్యి సంబంధిత వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. కైకలూరు టౌన్ ఎస్.ఐ. ఆర్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా భీమడోలు మండలం తడికలపూడికి చెందిన అందుగల థామస్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భీమవరం కిరాయికి వచ్చి వరుసకు సోదరుడైన రత్నారావుకు ఫోన్ చేసి ఇంటి వద్ద గొడవలు జరుగుతున్నాయని, అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పాడు. వెంటనే రత్నారావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో భీమవరం, ఉండి, ఆకివీడు పోలీసులు అప్రమత్తమయ్యారు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు భీమవరం నుంచి కైకలూరు వచ్చే బస్సులో థామస్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.దీంతో కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించినట్లు ఎస్.ఐ. తెలిపారు.

దోమల నివారణకు ప్రజలు సహకరించాలి

ఉంగుటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దోమల నివారణతో మలేరియా వ్యాప్తిని అరికట్టవచ్చని ఆరోగ్య సిబ్బంది ప్రచారం చేయాలని తాడేపల్లిగూడెం యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వై.వీ. లక్ష్మణరావు అన్నారు.శుక్రవారం కైకరం సచివాలయ పరిధిలో డ్రైడేను పాటించి ఇంటింటికీ ఫీవర్ సర్వే జరిపించారు. ఈ మేరకు ప్రజల్లో చైతన్యం నింపేందుకు ఆరోగ్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆయా ఇళ్లకు వెళ్లి నీటి నిల్వలు ఉన్న చోట తక్షణం తొలగించడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు.

10న మెడికల్ క్యాంపు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీపీ, సుగర్, ఫిట్స్, పక్షవాతం వ్యాధిగ్రస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాయితీపై మందులు అందజేసేందుకుగాను వైద్య నిపుణులు గోపాళం శివనారాయణ ఈ నెల 10న రెగ్యులర్ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసినట్టు జీబీఆర్ ఫౌండేషన్, శ్రీదుర్గతేజ లయన్స్ క్లబ్, జనవిజ్ఞాన వేదిక నిర్వాహకులు తెలియజేశారు. గతంలో పరీక్షలు చేయించుకున్నవారు రిపోర్టులతో హాజరు కావాలన్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఎస్‌ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలి : సీపీఎం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఓటర్ల హక్కును హరించే ఎస్‌ఐఆర్‌ను ఉప సంహరించుకోవాలని, కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి లొంగిన ఎన్నికల కమిషన్ తన వైఖరిని మార్చుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఎస్‌ఐఆర్‌ను ఉప సంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ పౌరులు ఓటు హక్కును ప్రశ్నించేలా బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఆర్)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, పి.రామకృష్ణ, రవికుమార్, ఎ.శ్యామలరాణి, ఎం. ఇస్సాకు, కనకారావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడు అప్పారావుకు అరుదైన అవకాశం

ఉంగుటూరు ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం నారాయణపురం వివేకానంద జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు సోమరాజు అప్పారావు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన సీసీఆర్టీ సెంటర్‌లో జూలై 16 నుంచి ఆగస్టు 5 వరకు21 రోజుల పాటు జాతీయ విద్యా విధానంపై జరిగిన శిక్షణలో పాల్గొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి కేవలం అప్పారావుకే ఈ అవకాశం లభించింది. ఈ సదస్సులో నేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఈ సందర్భంగా అప్పారావును నారాయణపురం హైస్కూలు హెచ్‌ఎం తోట పోతురాజుతో పాటు సహ ఉపాధ్యాయులు అభినందించారు.

సీతారామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో కలగర శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న ఆలయ పునర్నిర్మాణ కమిటీని నియమించనున్నట్టు తెలిపారు. కమిటీలో ఆసక్తి కలిగిన హిందువులు, రామ భక్తులు, సనాతన ధర్మం పాటించే ప్రతి ఒక్కరూ ఈ సమావేశంలో పాల్గొని సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసుల సతీశ్ ఆచార్యులు, మహంకాళి రాజా పాల్గొన్నారు.

ఆయిల్‌పాం గెలలు కోసే కూలీల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో వేల ఎకరాల్లో పామాయిల్ తోటల్లో గెలలు కోసే కూలీల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.సత్యనారాయణ,ఎం.జీవరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలోనే పామాయిల్ గెలలు కోసే కూలీలు దాదాపు 20 మందికి పైగా విద్యుత్ షాక్‌తో మృతి చెందారన్నారు. మృతుల కుటుంబాలకు సరైన నష్ట పరిహారం అందడంలేదన్నారు. పనికి పిలిచిన రైతులు విద్యుత్ తీగలు కూలీలకు తగలకుండా ముందుగానే విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయిల్‌పాం ఫ్యాక్టరీ యాజమాన్యం, విద్యుత్ శాఖ బాధిత కుటుంబానికి తగిన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌పాం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ

ఎత్తిపోతల పథకాన్ని సత్వరం పూర్తి చేయాలి

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సత్వరమే పూర్తి చేయాలని, అంతేకాకుండా జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలని నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సదస్సుకు ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. వక్తలు డి.వి.వి.ఎస్. వర్మ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, విశ్రాంత తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు రెడ్డి శ్రీనివాసడాంగే, బండి వెంకటేశ్వరరావు, పళ్ళెం కిషోర్, అడబాల లక్ష్మీ, కంచర్ల గురవయ్య, దొంత కృష్ణ, బాల యేసు, కె.వరప్రసాద్, ఉప్పులూరి హేమశంకర్, టి.బాబు పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరుక్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి వద్ద ఒక కారు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వారిని ఢీకొట్టింది. కారు ఢీకొట్టి వెళ్లడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంబంధిత వ్యక్తి వద్ద టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన కరెంట్ బిల్లు లభించింది. సమాచారం అందుకున్న త్రిటౌన్ పోలీసులు అర్ధరాత్రి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



చింతలపూడి ఏరియా ఆసుపత్రి

హా..సుపత్రి!

(5వ పేజీ తరువాయి)

ఆరేళ్లుగా నిర్మాణంలోనే ఉన్నాయి. ఇవి మంజూరై 13 సంవత్సరాలైనా అదిగో ఇదిగో అంటూ ఎదురుచూపులే.

కైకలూరులో టెక్నీషియన్లు లేరు.. పరీక్షలూ లేవు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో మొత్తం 14 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాలుగు కేంద్రాల్లో వైద్యాధికారుల కొరత ఉంది. మండవల్లి-1, గురజలో ఇద్దరు డాక్టర్లకు ఒకరు సెలవుపై వెళ్లారు. మూల్లలంక-1, కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు లేరు. కలిదిండిలోని డాక్టరు వారంలో మూడు రోజులపాటు కొల్లేటికోటలో విధులు నిర్వహిస్తున్నారు. ఇది కొల్లేరు గ్రామాల్లో ఉన్న ఏకైక పీహెచ్‌సీ కావడంతో పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు,పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప గ్రామాల్లోని ప్రజలంతా ఈ పీహెచ్‌సీకే వైద్య సేవల కోసం వెళుతుంటారు. వైద్యాధికారులు లేక ఆకివీడు, కైకలూరు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతనపల్లిలో ల్యాబ్ టెక్నీషియన్ లేక కోరుకొల్లు ఆస్పత్రి నుంచి వచ్చి వారంలో మూడ్రోజులపాటు సీతనపల్లి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. మూల్లలంకలో ల్యాబ్‌టెక్నీషియన్ సెలవుపై వెళ్లారు. లోకుముడి, కొల్లేటికోట, మండవల్లి ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్ లేడు. నియోజకవర్గ వ్యాప్తంగా ల్యాబ్‌టెక్నీషియన్‌ల కొరత వేధిస్తోంది. వర్షాకాలం కావడంతో పరీక్షలు చేసే అవకాశం లేక రోగులంతా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మండవల్లి ఆస్పత్రిలో ఫ్లోరింగ్ దిగిపోయి అస్తవ్యస్తంగా మారింది. ఆస్పత్రి ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి.కలిదిండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం చుట్టూ ప్రహరీ లేక పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముదినేపల్లి పీహెచ్‌సీకి వెళ్లే రహదారి ఇరువైపులా దట్టంగా మొక్కలతో మూసుకుపోయింది. ఆ రహదారి ధ్వంసం అవడంతో రోగుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

వ్యర్థాల రీ సైక్లింగ్..

జంగారెడ్డిగూడేనికి ప్రత్యేక యంత్రాలు
18,736 మెట్రిక్ టన్నుల రీసైక్లింగ్


రీసైక్లింగ్ అనంతరం శుభ్రంగా ఉన్న డంపింగ్ యార్డు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. దీనిలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జంగారెడ్డిగూడెం పట్టణంలోని డంపింగ్ యార్డులో చేపట్టిన వ్యర్థాల నిర్వహణతో ఉత్తమ ఫలితాలు కనిపిస్తున్నాయి.దాదాపు 20 ఏళ్ల నుంచి డంపింగ్ యార్డులో ఎనిమిది అడుగులకు పైగా పేరుకు పోయిన వ్యర్థాల(లెగసీ వేస్ట్) రీ సైక్లింగ్ చేపట్టారు. దీంతో నాడు అపరిశుభ్రంగా ఉన్న డంపింగ్ యార్డు నేడు శుభ్రంగా కనిపిస్తోంది.

15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు : పట్టణంలోని 29 వార్డుల నుంచి ప్రతి రోజు 20 టన్నుల తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి స్థానిక బైనేరు వంతెన వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి సంస్థ కింద పనిచేసే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు స్థానిక డంపింగ్ యార్డు వద్ద ఉన్న వ్యర్థాలను వేరు చేయడానికి ప్రభుత్వం రూ.1.36 కోట్లు మంజూరు చేసింది. దీనిలో అర్బన్ లోకల్ బాడీ షేర్(యూఎల్‌బీ) కింద జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.51 లక్షలు మంజూరు చేశారు. గుంటూరుకు చెందిన అవినాశ్ ఏజెన్సీ ఈ కాంట్రాక్టును పొంది ఫిబ్రవరిలో చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేసే పరికరాలను జంగారెడ్డిగూడెం డంపింగ్ యార్డు వద్ద అమర్చి పనులు ప్రారంభించారు. మొత్తం 58వేల 736 మెట్రిక్ టన్నులకు గాను గత మే నెలాఖరు నాటికి 18,736 మెట్రిక్ టన్నులను రీసైక్లింగ్ చేశారు. మిగతా 33 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను అక్టోబర్ నాటికి పూర్తి చేస్తారు.


డంపింగ్ యార్డు వద్ద రీసైక్లింగ్ యంత్రం

వేర్వేరుగా వ్యర్థాలు : తడి, పొడి చెత్త, రాళ్లు, మట్టి, ప్లాస్టిక్, వేస్ట్ క్లాత్‌లను రీ సైక్లింగ్ యంత్రంలో వేయడంతో దానంతట అదే వేరు చేస్తోంది. వచ్చిన మెటీరియల్‌లో మట్టిని పట్టణంలో లోతట్టు ప్రాంతాలను పూడ్చడానికి ఉపయోగించారు. రాళ్లను రోడ్ల నిర్మాణానికి ఉపయోగించారు. ప్లాస్టిక్, క్లాత్‌లతో వచ్చిన వేస్ట్‌ను గుంటూరు జిందాల్ విద్యుత్ ప్లాంట్‌కు పంపించారు.

స్వచ్ఛ పట్టణమే లక్ష్యం : కె.వి.రమణ, మున్సిపల్ కమిషనర్



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో డంపింగ్ యార్డులో 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశాం. డంపింగ్ యార్డు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేందుకు మొక్కలు నాటి పార్కుగా అభివృద్ధి చేస్తాం. అక్టోబర్ 2 నుంచి డంపింగ్ యార్డులో చెత్తను ఎప్పటికప్పుడు రీ సైక్లింగ్ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం చిన్న యంత్రాలను అందజేయనుంది. ప్లాస్టిక్, క్లాత్‌లను రీ సైక్లింగ్ చేయగా వచ్చిన వేస్ట్‌ను త్వరలో రాజమండ్రిలో పూర్తికావస్తున్న పవర్ ప్లాంట్‌కు పంపుతాం. ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో పట్టణానికి రూ.70 లక్షల విలువైన స్వీపింగ్ మెషిన్, చెత్తను తరలించడానికి రూ.65 లక్షలతో కంపాక్టర్‌ను ఇవ్వనుంది. చెత్త సేకరణకు అద్దె ప్రాతిపదికన 13 ఎలక్ట్రికల్ ఆటోలు కేటాయించారు. పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. స్వచ్ఛ జంగారెడ్డిగూడెంగా చేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాం.


టి.నరసాపురంలో విశాలాక్షి


ఏలూరులో సౌభాగ్యలక్ష్మీదేవి


లలితాదేవి


అంకంపాలెంలో వరలక్ష్మి


చింతలపూడిలో మహాలక్ష్మి


మాదేపల్లిలో ధనలక్ష్మి

వరాలిచ్చే అమ్మ

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు
మహిళలతో కళకళలాడిన ఆలయాలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలోని రెండవ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలతో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను జరిపించారు. పూజలు, వ్రతాలతో, ఆలయాలు కిటకిటలాడాయి.సత్రంపాడులోని సౌభాగ్య లక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీ దేవిగా అలంకరించి దర్శనమిచ్చారు. అంబికా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ బ్రదర్స్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పత్తేబాదలోని కనకదుర్గమ్మ ఆలయ అర్చకులు ప్రయాగ వెంకట రామ్మూర్తి భక్తులతో, మహిళలతో పూజలు చేయించారు. సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో, బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ ఆలయంలో, అగ్రహారంలోని జ్ఞాన సరస్వతీదేవి, కన్యకాపరమేశ్వరి, దక్షిణపు వీధిలోని మహిషాసురమర్ధిని, బాలత్రిపుర సుందరీదేవి, శివనగర్‌లోని భ్రమరాంబదేవి ఆలయం వద్ద, పవరుపేటలోని కాశీ అన్నపూర్ణాదేవి ఆలయం వద్ద, పలు డివిజన్లలోని కనకదుర్గమ్మ ఆలయాల వద్ద మహిళలు వరలక్ష్మీవ్రతాలు జరపడంతో ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.

● ఏలూరు రూరల్: శ్రావణ మాసం మూడో శుక్రవారం జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇంటింటా వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. ఇళ్ళకు మంగళ తోరణాలు కట్టి శ్రావణ లక్ష్మిని సాదరంగా ఆహ్వానించిన మహిళలు, అమ్మవారి విగ్రహాలను కొలువు తీర్చి పూజలు నిర్వహించారు. ఆలయాల్లో జరిగిన సామూహిక వ్రతాల్లో భారీగా పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. మాదేపల్లి గ్రామంలోని అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు.

● దెందులూరు: వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి చింతమనేని రాధమ్మ పేర్కొన్నారు. శుక్రవారం గాలాయగూడెంలో గ్రామ దేవత అచ్చమ్మ పేరంటలమ్మ ఆలయంలో అమ్మవారికి చీర, సారే అందించారు. పార్టీ గ్రామాధ్యక్షుడు పూజారి శ్రీనువాసరావు కనకదుర్గ దంపతులు, గ్రామస్థులతో కలిసి అమ్మవారికి పుట్టింటి చీర, సారెను అందజేశారు.ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్థులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. రాట్నాలకుంటలో రాట్నాలమ్మ తల్లికి ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావుతో పాటు పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లచింతలపూడిలో గ్రామ దేవత శ్రీ పాటిమ్మతల్లిని యలమర్తి శ్రీనివాస్, హేమలత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● చింతలపూడి: వరలక్ష్మీ వ్రతాన్ని మండల వ్యాప్తంగా ఆలయాల్లో మహిళలు ఘనంగా నిర్వహించారు. కొత్త బట్టలు, బంగారం కొనుగోలు చేసి మహాలక్ష్మీ ప్రతిమలకు వస్త్రాలు తొడిగి నగలు అలంకరించి మహిళలు చేతికి తోరం కట్టుకుని పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు.

● జీలుగుమిల్లి: స్థానిక జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఇటీవల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అమ్మవారి ఆలయం తొలగించాలని అధికారులు పెర్కొనడంతో గ్రామ ఇలవేల్పును మన మధ్యలోనే ఉండి పూజలందుకోవాలని మహిళలు కడసారిగా అమ్మవారిని మొక్కుకున్నారు. పి.అంకంపాలెం రామాలయంలో, ములగంపల్లి, రౌతుగూడెం, కామయ్యపాలెం, తాటియాకులగూడెం గ్రామాల్లో అమ్మవార్ల విగ్రహాలు ఏర్పాటు చేసి మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు.

● కామవరపుకోట:శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీలక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో భక్తులు లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు మహిళలతో సామూహికంగా కుంకుమ పూజలు, అర్చనలు జరిపించారు. ఉప్పలపాడులోని కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు భక్తులు నిర్వహించగా ఆలయ అర్చకులు ఇలపర్తి శివరామయ్యశర్మ అర్చనలు జరిపించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో బారులు తీరాయి. గ్రామ దేవత గంగానమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న నూకాలమ్మ అమ్మవారు స్వర్ణ వర్ణ పూర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి రజత వస్త్ర తయారీకి మంత్రపూడి శ్రీనివాసరావు, రేవతి దంపతులు ఐదు తులాల వెండి, చీకట్ల రమేష్, సాయి దివ్య దంపతులు ఐదు తులాల వెండిని అమ్మవారికి సమర్పించినట్టు ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

● పోలవరం: పోలవరం, గూటాల, పట్టిసీమ, కొత్త పట్టిసీమ, తోటగొంది, ప్రగడపల్లి, వెంకటపురం, ఎల్.ఎన్.డి.పేట, కచేరి, కొత్తరామయ్యపేట పునరావాస కాలనీ, కోండ్రుకోట పునరావాస కాలనీల్లో కనకదుర్గ ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● టి.నర్సాపురం: టి.నర్సాపురంలో ఉన్న శ్రీఅన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో విశాలాక్షి అమ్మవార్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి మహిళలు పసుపుకుంకమలు సమర్పించారు. ఇళ్లల్లో అమ్మవారి బొమ్మలను నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు.

పేదలను ఆదుకుంటాం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యల్లో భాగంగా విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు, వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ప్రజావసరాలు తీర్చడమే సుపరిపాలనలో తొలి అడుగు ముఖ్య ఉద్దేశమన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం చేయడం ద్వారా వారి అభ్యున్నతికి తోడ్పడుతున్నామన్నారు. ముగ్గురు విద్యార్థినులకు ల్యాప్‌లు, చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు.ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, నగర అధ్యక్షులు చోడే వెంకట రత్నం, బెల్లంకొండ కిషోర్ పాల్గొన్నారు.


ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతరం పాముల దిబ్బలో అగ్నిప్రమాద బాధితులను ఎమ్మెల్యే చంటి పరామర్శించారు. వీరి వెంట ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, అశోక్‌కుమార్ ఉన్నారు.


రోడ్డు పనులు నిర్వహిస్తున్న దృశ్యం

వేగవంతంగా బైపాస్ రోడ్డు నిర్మాణం

కామవరపుకోట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు- జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని కామవరపుకోట మండలం ఆడమిల్లి సచివాలయం సమీపంలోని పాత వంతెన గత నెలలో కూలిన సంగతి తెలిసిందే. దీంతో బైపాస్ రోడ్డు వేసేందుకుగాను అధికారులు శ్రీకారం చుట్టి పనులు వేగవంతంగా చేస్తున్నారు. వంతెన కుంగిన నేపథ్యంలో ఆడమిల్లి నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గాన్ని వెంకటకృష్ణాపురం, ద్వారకాతిరుమల మీదుగా మళ్లించారు. దీంతో ప్రయాణికులు ఎక్కువ సమయం పడుతుందని అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కాంట్రాక్టర్లను, అధికారులను సమన్వయపరిచి వేగవంతంగా పనులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో జేసీబీలు, రోలర్స్ ద్వారా పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మరో మూడు రోజుల్లో ఈ బైపాస్ రోడ్డులో వాహనాలు రాకపోకలు సాగుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : చింతమనేని

పెదపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు గ్రామం ఎస్సీ కాలనీలో జరుగుతున్న అంతర్గత డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే చింతమనేని శుక్రవారం పరిశీలించారు. డ్రెయినేజీ పనులను పరిశీలించి లోటుపాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి వాటిని పరిష్కరించడానికి తగిన నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డ్రెయినేజీ నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామంలో డ్రెయినేజీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా బంజారా తీజ్ పండుగ

టి.నర్సాపురం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో బంజార బజరంగి భేరి సంఘం ఆధ్వర్యంలో పెళ్లికాని ఆడపిల్లలు 9రోజుల పాటు జరుపుకునే తీజ్ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలంతా పాడిపంటలు పండి సిరి సంపదలతో పాటు సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో ఆడబిడ్డలు నిర్వహించే పండుగ తీజ్ అన్నారు. సంఘ అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలు పుట్టింటికి, మెట్టినింటికి కీర్తిప్రతిష్టలు తెచ్చేలా వారిలో నైతిక, సామాజిక విలువలను నేర్పుతూ వారిలో మనోధైర్యం జీవించే లక్షణంతో పెంచేందుకు తీజ్‌పండుగ ఉపయోగపడుతుందన్నారు. దారవత్తు రవినాయక్, దేశావత్తు వెంకట్, భూక్యా సత్యం, ధనలక్ష్మి, జరబల కృష్ణ, లీలా, భూక్యా సునీల్, గగ్గులోతు బాబు, లావుడియ సంధ్యా, జరబల పద్మ, భూక్యా భద్రమ్మ, వెంకమ్మ, నీరజ పాల్గొన్నారు.

నేడు ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కుక్కునూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకతీతంగా హక్కులు,చట్టాల కోసం ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూరం సంజీవరావు అన్నారు. శుక్రవారం రెడ్డిగూడెంలో జరిగిన ఆదివాసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగే ఆదివాసీ దినోత్సవానికి ప్రతి ఒక్కరూ రావాలన్నారు. పైడా పరమేశ్వరరావు, వేణుగోపాల్, జిడ్డు రవిబాబు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శనివారం ఐటీడీఏ వద్ద జరిగే ఆదివాసీ పండుగను గిరిజనుల జీవనశైలి, వారి సంస్కృతి ఆచార సాంప్రదాయాల్ని ప్రతిబింబించేలా నిర్వహించాలని, ఆయా శాఖల అధికారులు సమన్వయంలో నియోజకవర్గంలో గిరిజనులంతా పాల్గొనాలన్నారు.. మడకంవారిగూడెంలోని వెంకటేశ్వరావు పొలం వద్ద ఆదివాసీ దినోత్సవం ఏ ర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

● బుట్టాయగూడెం:ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సభను నిర్వహించగా రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. నాయకులు పిలిప్, పి.నాగేశ్వరరావు, కె.భీమరాజు, టి.రాజు, కె.శ్రీరాములు, జి.డేవిడ్‌రాజు, ఎన్.వికాశ్, జి.ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

10న చెస్ పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక పడమర వీధిలో ఉన్న విజ్ఞాన విహార స్కూల్‌లో ఈనెల 10న ఏలూరు జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో అండర్17 విభాగంలో ఓపెన్ చెస్, బాలికలకు ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ వేల్పూరి వాసుదేవరావు తెలిపారు. ఏలూరు జిల్లాలోని చెస్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారానికి 95539 87398 నెంబర్లలో సంప్రదించవలసినదిగా కోరారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

ఏలూరుటూటౌన్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు స్వయం ఉపాధి శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఫణికుమార్ తెలిపారు. పురుషులకు సీసీటీవీ, సీసీ కెమేరాల రిపేరింగ్, పుట్టగొడుగుల పెంపకంలో శిక్షణ, మహిళలకు బ్యూటీ పార్లర్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18 నుంచి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. యూనియన్ బ్యాంకు ముద్ర రుణాల కోసం సిపార్సు చేస్తామన్నారు. ఇతర వివరాలకు 99485 65256, 95027 23561ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దెందులూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విజయరాయి సెక్షన్ కొప్పాక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ(ఆపరేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. కొప్పాక అంకన్నగూడెం, పెదకడిమి, అమ్మపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

వాహనాల తనిఖీలు

ఏలూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలోని రంగాపురంలో ఎస్‌ఐ కే వెంకన్న వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను తమతో ఉంచుకోవాలన్నారు.మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



మహిళల పాదయాత్ర

టి.నర్సాపురం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళాభక్తులు ద్వారకాతిరుమల పాదయాత్రగా వెళ్లారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లి నుంచి టి.నర్సాపురం మీదుగా ద్వారకాతిరుమల వెళ్లి స్వామి వార్ని దర్శించుకునే క్రమంలో మార్గమధ్యలో ఉన్న టి.నర్సాపురంలోని శ్రీఅన్నపూర్ణ, విశాలక్ష్మి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్ని దర్శించుకున్నారు. వరలక్ష్మీవ్రతం రోజున ప్రతీఏటా ద్వారకాతిరుమల పాదయాత్రగా వెళ్లి స్వామివార్ని దర్శించుకుంటామని వారు తెలిపారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఆటో కార్మికుల ఆందోళన

పోలవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసి బస్సులు ఉచిత ప్రయాణ సౌకర్యం ఈ నెల నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం పోలవరం ఆటో యూనియన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఆర్టీసీ ప్రయాణాల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ ఉచిత ఆర్టీసీ ప్రయాణాల వల్ల ఆటో కార్మికులు రోడ్డునపడే పరిస్థితులు తలెత్తుతాయని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు తాళ్ళపూడి చంద్రరావు, షేక్ షెహిన్షాబాషా, పిల్లంగోరు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి నాగరాజు, ఈర్నాల జాన్, కొత్తపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఘర్‌పై అవగాహన

ఉంగుటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐస్ ఫ్యాక్టరీల యజమానులకు సోలార్(సూర్యఘర్) పథ కం ప్రయోజనాలను విద్యుత్ శాఖ అధికారులు గురు వారం రాత్రి నారాయణపురంలోని ఎమ్మెల్యే పాత క్యాంపు కార్యాలయంలో వివరించారు. ఈ పథకం ద్వారా తమ విద్యుత్తు వినియోగాన్ని తక్కువ ఖర్చుతో ఆయా ఫ్యాక్టరీల రూఫ్ టాప్‌లో ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా విద్యుత్ ఆదాతో పాటు పర్యావరణ ముప్పునుంచి కాపాడు కోవచ్చన్నారు. సమావేశంలో ఏలూరు డి.ఈ.కే.ఎం. అంబేద్కర్, ఏ.డి.ఈ.రాళ్ళపల్లి భీమేశ్వరరావు, గొల్లగూడెం, చేబ్రోలు ఏ.ఈ.లు వేణు, శ్రీరాం పాల్గొన్నారు.

సెప్టెంబరు 4 నుంచి సీఐటీయూ జిల్లా మహాసభలు

నూజివీడు టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) 13వ జిల్లా మహాసభల కరపత్రాలను ఆ యూనియన్ల నాయకులు శుక్రవారం నూజివీడులో ఆవిష్కరించారు. నూజివీడులోని పెనుగొండ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సెప్టెంబరు 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన ఈ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. సీఐటీయూ నాయకుడు జి.రాజు మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నూజివీడు డివిజన్‌లో విస్తారంగా వర్షాలు

నూజివీడు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు డివిజన్‌లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. డివిజన్ పరిధిలోని ముసునూరు మండలంలో అత్యధికంగా 59.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, లింగపాలెం మండలంలో 31.4, నూజివీడు మండలంలో 26.2, చింతలపూడి మండలంలో 13.2, ఆగిరిపల్లి మండలంలో 9.6, చాట్రాయి మండలంలో 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పొలాలు ఎండిపోతుంటే చోద్యం చూస్తున్నారు

ఇరిగేషన్ అధికారులపై ఎంపీపీ ధ్వజం

ముదినేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సార్వా వరి పొలాలు సాగునీరందక ఎండిపోతుంటే ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. ముదినేపల్లి మండలంలో పోల్‌రాజ్ కెనాల్ కింద నీరందక చిగురుకోట, చినకామనపూడి పెదకామనపూడి గ్రామాల ఆయకట్టులో ఎండిపోయిన వెదజల్లిన వరి పొలాలను రైతులతో కలసి శుక్రవార ం ఆయన పరిశీలించారు. వర్షాలు సరిపడినంతగా కురివని పరిస్థితుల్లో పంట భూములకు నీరందించే విషయంలో ఇరిగేషన్ అధికారులు దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవ తీసుకుని పోల్‌రాజ్ కెనాల్‌కు నీటి విడుదలను పెంచేలా కృషి చేయాలని కోరారు. ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రూ. వేల కోట్లతో పేదలకు వైద్యం: మంత్రి సారథి



నూజివీడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):పేదలకు మెరుగైన వైద్యం కోసం వేలాది కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చుచేస్తోందని, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో నలుగురు వ్యక్తులకు సంబంధించి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మంత్రి సారథిని ఆశ్రయించగా, మొత్తం రూ.6,75,000లను ఎల్‌వోసిగా మంజూరు చేయించి సదరు లేఖలను బాధిత కుటుంబీకులకు అందించారు. చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామానికి చెందిన రాంబాబు కుటుంబానికి 1.75 లక్షలు, ఆగిరిపల్లి మండలం ఎస్‌ఏ పేటకు చెందిన డి.గంగరాజుకు రూ.50 వేలు, ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన పి.సంధ్యకు రూ.3లక్షలు, చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావు కుటుంబానికి రూ.లక్షన్నర మంత్రి సారథి స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ రద్దు చేయగా, కూటమి ప్రభుత్వం దాన్ని పునరుద్ధరించిందన్నారు. బాధిత కుటుంబీకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

హౌసింగ్ బిల్లుల చెల్లింపుపై హర్షం

ముసునూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం హయాంలో హౌసింగ్ పెండింగ్ బిల్లులు ఆరేళ్ళ తరువాత చెల్లించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముసునూరు మండలంలో 2014-19 మధ్య ఉన్న పెండింగ్ బిల్లులు 647 మందికి రూ 2.27 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో కూటమి ప్రభుత్వం జమ చేసింది. 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో అప్పటి వరకు ఉన్న హౌసింగ్ బిల్లులను ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసింది. అయితే గత ఎన్నికల ప్రచారంలో నూజివీడు శాసనసభ్యులు, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి టీడీపీ హయాంలో పెండింగ్ హౌసింగ్ బిల్లులను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు బిల్లులు విడుదల చేయడంతో మంత్రి పార్థసారథికి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్, బీసీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహాను, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగలకు న్యాయం చేయాలి

ఆగిరిపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లలో మాదిగలకు అన్యాయం జరిగిందని ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండు వీరన్న మాదిగ అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లిలో రాష్ట్ర అధికార ప్రతినిధి మంగళపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు సానుకూలంగా తీర్పునిచ్చినప్పటికీ, సీఎం చంద్రబాబునాయుడు తమ జాతి పట్ల సానుకూలంగా స్పందించినా ఇచ్చిన రేషియోలో మాత్రం మాదిగలకు అన్యాయమే జరిగిందని ఆరోపించారు. మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు గురివిందపల్లి చిట్టిబాబు మాదిగ, అరుంధతి బంధుసేవ రాష్ట్ర నాయకుడు మట్ట మరుసాయి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల సుధాకర మాదిగ, జిల్లా నాయకులు లింగవరపు సాధు సుందర్‌సింగ్, కొదమల గంగాధర్, పెనుమొచ్చు కమలాకర్, కంబాల ప్రదీప్‌కుమార్, మహిళా నాయకురాలు ప్రశాంతి మాదిగ, ఉదయగిరి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో హ్యాపీ వ్యాలీ విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేకేఆర్ హ్యాపీ వ్యాలీ స్కూల్ విద్యార్థులు టేబుల్ టెన్నిస్ పోటీలలో కాంస్య పతకం సాధించారని స్కూల్ ఛైర్మన్ కె. కోటేశ్వరరావు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో హ్యాపీ వ్యాలీ విద్యార్థులు ఎ. అభిరామ్, వి. గోపాలకృష్ణ, పి. లీలాధర్, డి. రిత్విక్, అండర్ - 19 టీమ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో కాంస్య పతాకం సాధించారన్నారు. సింగిల్స్ విభాగంలో వి గోపాలకృష్ణ కాంస్య పతకం సాధించి సీబీఎస్ఈ జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కి అర్హత సాధించారన్నారు. పాఠశాల అధినేత కే కోటేశ్వరరావు తదితరులు విజేతలను అభినందించారు.

బావిలో పడిన ఆవును రక్షించిన అగ్నిమాపకశాఖ



కైకలూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడిన ఆవును అగ్నిమాపక శాఖ అధికారులు సురక్షితంగా బయటకు తీశారు. కైకలూరు మార్కెట్ యార్డ్ సమీపాన ఖాళీ స్థలంలో ఉన్న బావిలో ఆవు పడిపోవడంతో శుక్రవారం అగ్నిమాపకశాఖ అధికారులు స్థానికుల సహాయంతో అతి కష్టంమీద ఆవును సురక్షితంగా బయటకు తీశారు.

మహాలక్ష్మీ నమోస్తుతే!



భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

చాట్రాయి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళలు శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వరలక్ష్మీ దేవికి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. చాట్రాయి దుర్గమ్మ, ఆరుగొలనుపేట శ్రీలక్ష్మమ్మ అంకమ్మ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండలంలోని ఆరుగొలనుపేటలో శ్రీలక్ష్మమ్మ అంకమ్మ ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటల నుండి భారీ అన్నసమారాధన జరుగుతుందని భక్తులంతా పాల్గొనాలని కోరారు.

మండవల్లి: శ్రీవిజయదుర్గ అమ్మవారికి బ్రహ్మర్షి చాగంటి శ్రీనివాసరావు 27 జన్మనక్షత్రాలను సూచిస్తూ 27 చీరలతో అమ్మవారికి అలంకరణ చేశారు.

నూజివీడు: నూజివీడు కోటమహిషాసుర మర్దిని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి అభిషేకాలు, లక్ష కుంకుమార్చన జరిగింది.

కైకలూరు: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. అమ్మవారికి పుష్పాలంకరణ రామిశెట్టి బాలవెంకట దుర్గారావు చేయ గా భక్తులకు ఉచిత ప్రసాదానికి పొట్లూరి జగన్మోహనరావు, బచ్చు నాగవెంకట మురళీకృష్ణ, భైరాజు ఆదినారాయణమూర్తి, ముంగర ఏడుకొండలు, నిమ్మగడ్డ అశోక్‌హేమంత్, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, బుర్ల సత్యనారాయణ సహకరించారు. ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

ముక్కలైన డివిజన్.. ఒక్కటి కానుందా?



నూజివీడు నియోజకవర్గ మ్యాప్

వైసీపీ ప్రభుత్వం చేసిన జిల్లాల మార్పులు, చేర్పులతో రాష్ట్రంలో అనేక జిల్లాల వాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనాలోచిత చర్యల వల్ల సుదీర్ఘకాలం నుంచి ఉన్న డివిజన్‌లు సైతం కుంచించుకుపోవడం, కొన్ని నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు తరలివెళ్లిపోయి డివిజన్, నియోజకవర్గాల ప్రాధాన్యం తగ్గిపోయింది. అలా ప్రాధాన్యత కోల్పోయిన డివిజన్ నియోజక వర్గాల్లో నూజివీడు ఒకటి.

(ఆంధ్రజ్యోతి - నూజివీడు)

▸▸జిల్లా మార్పునకు శ్రీకారంపై ప్రజల్లో హర్షం ▸▸ నూజివీడు వాసుల్లో చిగురిస్తున్న ఆశలు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు ఉన్నప్పుడు కృష్ణా జిల్లాలోని 14 మండలాలతో అతిపెద్ద డివిజన్‌గా నూజివీడు ఉండేది. మరోవైపు ఉమ్మడి కృష్ణా జిల్లాలో దాదాపు మధ్యస్థంగా ఉండడంతో డివిజన్‌కు అత్యధిక ప్రాధాన్యం లభించేది.

మూడు ముక్కలైన నూజివీడు డివిజన్

జిల్లాల విభజనతో 14 మండలాలతో ఉన్న నూజివీడు డివిజన్ దాదాపు మూడుముక్కలు అయింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో పూర్వపు నూజివీడు డివిజన్‌లోని మండలాలు కలిశాయి. పూర్వపు డివిజన్‌లో నూజివీడు నియోజకవర్గంలో గల నాలుగు మండలాలు ఏలూరు జిల్లా కేంద్రంగా ఉన్న నూజివీడు డివిజన్‌లో ఉండగా, మిగిలిన పది మండలాల్లోని కొన్నింటిని ఎన్టీఆర్ జిల్లా పరిధిలో తిరువూరు డివిజన్‌ను ఏర్పాటు చేయగా, మరికొన్నింటిని గుడివాడ డివిజన్‌లో విలీనం చేశారు.

నాలుగు మండలాలతో కుదేలు

గత ప్రభుత్వం నిర్ణయం వల్ల 14 మండలాల నూజివీడు డివిజన్ నాలుగు మండలాలకు కుదించబడింది. దీంతో సేల్స్ ట్యాక్స్ కార్యాలయం, ఉద్యానవన పంటలకు కేంద్రంగా ఉన్న నూజివీడు నుంచి ఉద్యానవన సహాయ సంచాలకుల కార్యాలయం, పౌర సంబంధాల శాఖ కార్యాలయాలు ఏలూరుకు తరలాయి. ఈ పరిస్థితుల్లో నూజివీడు డీఎస్పీ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాలు సైతం నిబంధనల ప్రకారం తరలిపోయే ప్రమాదం పొంచి ఉండడంతో నాటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అప్పటి సీఎం జగన్‌ను కలిసి విన్నవించడంతో నాడు పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం మండలాలను నూజివీడు డివిజన్‌కు కలపడంతో పాటు పెదపాడు, పెదవేగి మండలాలను నూజివీడు పోలీస్ డివిజన్‌లో కలిపారు. ఆయా మండల వాసులకు నూజివీడులో కలవడం ఇబ్బందికరంగా మారింది. నూజివీడు రెవెన్యూ డివిజన్ 6 మండలాలైంది. నూజివీడు ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్నప్పుడు డివిజన్ మెట్ట ప్రాంతం కావడంతో జిల్లాలో ప్రాధాన్యం ఉండేది. నూజివీడు ఏలూరు జిల్లాలో కలపడం వల్ల ఆ జిల్లాలో ఒక మారుమూల ప్రాంతంగా ఉండడం, అప్పటికే ఆ జిల్లాలో మెట్ట ప్రాంతంగా ఉన్న జంగారెడ్డిగూడెంకు ఉన్న ప్రాధాన్యం నూజివీడుకు లేదనే చెప్పాలి.

సీఆర్‌డీఏపై కక్షతోనే..

జగన్ ప్రభుత్వం సీఆర్‌డీఏ పరిధిలో చుట్టూ ఉన్న డివిజన్‌లను, జిల్లాలు మార్చి సీఆర్‌డీఏని దెబ్బతీసే భాగంలోనే నూజివీడును ఏలూరు జిల్లాలో కలిపారనేది నగ్నసత్యం. ఇప్పుడు నూజివీడు నియోజకవర్గం సీఆర్‌డీఏలో ఉంది. అవుటర్ రింగ్ రోడ్డు నియోజకవర్గ పరిధిలోని ఆగిరిపల్లి మండలం నుంచి వెళుతోంది. అవుటర్ రింగ్ రోడ్డు పూర్తయితే నియోజకవర్గం అభివృద్ధికి బాటలు పడినట్లే.

రెండు సార్లు బాబు హామీ

చంద్రబాబు ప్రతిపక్షనేతగా నూజివీడు రెండుసార్లు వచ్చారు. వచ్చిన ప్రతిసారి నియోజకవర్గ ప్రజలు తమ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల హామీగా ఆయన ఎన్నికల ప్రచార సభకు వచ్చినప్పుడు చంద్రబాబు సభాముఖంగా విజయవాడ జిల్లా కేంద్రంగా ఉన్న జిల్లాలో నూజివీడును చేర్చుతానని హామీ ఇచ్చారు. సీఎం అయిన తర్వాత ఆగిరిపల్లి పీ-4 కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన దృష్టికి ప్రజలు ఈ విషయాన్ని మరోసారి తీసుకురాగా తనకు గుర్తు ఉందంటూ ఆయన పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు, డివిజన్ కేంద్రాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని వేయడం, ఎంతవరకు వచ్చిందని బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అడగడం, నెల రోజులలో దీనిపై నివేదిక ఇవ్వాలని డిసెంబరు నాటికి సమస్యకు పరిష్కారమయ్యేలా చర్యలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేయడంతో నూజివీడు నియోజక వర్గంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

బందులదొడ్డిలోని పశువులను తీసుకెళ్లకుంటే..

గో శాలకు తరలిస్తాం : కామినేని

కైకలూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):రహదారులపై గోవులను వదిలితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం కైకలూరు బందులదొడ్డిలో బంధించిన ఆవులను ఆయన పరిశీలించి మాట్లాడుతూ కొంతమంది రైతులు రహదారిపైకి ఆవులను వదిలివేస్తున్నారని దీంతో పలువురు ప్రమాదాలకు గురి కావడమే గాక ఆవులు చెరువు గట్లుపైకి వెళ్లి విద్యుదాఘాతానికి గురై మరణి స్తున్నాయని అనేక గోవులు ప్రమాదాలకు గురై కాళ్ళు విరిగిపోతున్నాయని దీనిని గోహింస కిందే పరిగ ణిస్తారన్నారు. స్వచ్ఛం దంగా ఆవులు మేపుకునే రైతులకు ఉచితంగా అందిస్తామని ఎవ్వరూ తీసుకువెళ్లకపోతే వీటిని గోశాలకు తరలిస్తామన్నారు.

గర్భాలయ ద్వారాలకు వెండి తొడుగు వితరణ

ఆలయాల్లో కల్పిస్తున్న వసతులతోనే భక్తుల సంఖ్య పెరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయానికి 20 మంది దాతల సహకారంతో 16 కేజీల వెండితో అమ్మవారి గర్భాలయ తలుపులకు ఏర్పాటు చేసిన వెండి తొడుగును పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమన్నారు. కైకలూరుకు చెందిన పిచ్చుకల నాగేశ్వరరావు, పి. పవన్‌కాంత్ 4 కేజీల వెండి సింహాన్ని ఆలయానికి అందించడం అభినందనీయమన్నారు. అలాగే ఆలయంలో కొలువై యున్న పార్వతీ సమేత కనకలింగేశ్వరస్వామికి వెండి నాగాభరణాన్ని 4 కేజీలతో భుజబలపట్నానికి చెందిన ఎం. కొండరాజు చేయిస్తారని ఎమ్మెల్యే వెల్లడించారు. తలుపులకు వెండి తొడుగులు అందించిన 20 మంది దాతలను ఎమ్మెల్యే సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, కో-ఆప్షన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి చెక్కు పంపిణీ

కలిదిండి: మండలంలో చినతాడినాడ పంచాయతీ పరిధి ఉల్లిపాలెంలోని దుర్గమ్మ వారికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శుక్రవారం పూజలు చేసి ఆలయ నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఆలయ కమిటీకి అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కామినేనిని సత్కరించారు. రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షులు తాడినాడ బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం తాడినాడలో పోల్‌రాజ్ కెనాల్‌లో పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలరాజ్ కెనాల్ శివారు గ్రామాలకు సాగు, తాగునీరు సరఫరా కాకపోవటంతో పూడికతీత పనులు చేస్తున్నారన్నారు. భారీ వర్షాలకు పంట పొలాలు ముంపు బారిన పడకుండా మురుగు కాల్వలను ప్రక్షాళన చేస్తున్నామన్నారు.



వెండి తొడుగుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

ఆక్వాకు కూటమి అండ..

ముదినేపల్లి: ఒడిదుడుకులతో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రంగానికి అండగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కామినేని తెలిపారు. ముదినేపల్లి మండలం వైవాకలో ఏర్పాటు చేసిన వనామీ రొయ్యల సీడ్ హేచరీని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నదని అమెరికా పెంచిన సుంకాలను సైతం తట్టుకుని ఆక్వా రైతులు నిలదొక్కుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాణ్యమైన రొయ్యల సీడ్ హేచరీలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

వాహనాల మళ్లింపు ఇలా..

ముదినేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా గుడివాడ - ముదినేపల్లి జాతీయ రహదారిలో మల్లాయపాలెం రైల్వే గేటును 15 రోజులపాటు మూసివేస్తున్నందున శనివారం నుంచి పోలీసు శాఖ అధికారులు వివిధ రూట్లలో వాహనాల మళ్లింపునకు ప్రణాళిక ఖరారు చేశారు. గుడివాడ నుంచి ముదినేపల్లి, భీమవరం ఆపై ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలు ఏయే రూట్లలో వెళ్లాలన్నది గుడివాడ సబ్ డివిజనల్ పోలీసు అధికారులు శుక్రవారం ప్రకటించారు. భీమవరం నుంచి వచ్చే వాహనాలను సింగరాయపాలెం - చెన్నూరు, వడ్లమన్నాడు, గుడ్లవల్లేరు మీదుగా గుడివాడకు, ముదినేపల్లి నుంచి విన్నకోట, గుడ్లవల్లేరు మీదుగా గుడివాడకు వాహనాలను మళ్లిస్తున్నట్లు, గుడివాడ నుంచి ముదినేపల్లి, భీమవరం, బంటుమిల్లి ఆపై ప్రాంతాలకు వెళ్లే వాహనాలు కూడా పై రెండు రూట్లలో వెళ్లవచ్చునని పోలీసు అధికారులు తెలిపారు.

10 లోగా ఆవులను తీసుకువెళ్లాలి

కైకలూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ లోపు ఆవులను రైతులు తీసుకువెళ్లకపోతే సుదూర ప్రాంతాల్లోని గోశాలలకు తరలించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి పి. ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గత కొద్దిరోజులుగా కైకలూరు పట్టణంలో రహదారులపై సంచరిస్తున్న 80 పశువులను రైతుబజారు ఎదురుగా ఏర్పాటుచేసిన బందులదొడ్డిలో బంధించామన్నారు. వీటి యజమానులు 10వ తేది సాయంత్రం 5 గంటల లోపు స్వాధీనం చేసుకోకుంటే గోశాలలకు తరలిస్తామన్నారు. అలాగే గోవులను పోషించే ఆసక్తిగల రైతులకు దానం చేస్తామన్నారు. ఆవుల రైతులు గమనించి ఎవరి ఆవులను వారు తీసుకువెళ్లాలని కోరారు.

అనర్హుల జాబితాపై విచారణ

కలిదిండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 44 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించకపోవడంతో ఏ కారణం వల్ల వర్తించలేదన్న విషయమై సమగ్ర విచారణ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. దీంతో ఆన్‌లైన్ రైతుల భూమి వివరాలు, తదితర అంశాలను విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. అర్హులైన రైతులకు నగదు జమ అవుతుందన్నారు.

13న క్విట్ కార్పొరేట్ ధర్నాలు

చాట్రాయి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 13న క్విట్ కార్పొరేట్ ధర్నాలు, నిరసన ర్యాలీలు జరపాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని అఖిల భారత కిసాన్ మహాసభ జాతీయ కార్యదర్శి డి. హరనాధ్ అన్నారు. వ్యవసాయ రంగాన్ని కబళిస్తున్న కార్పొరేట్లను వెళ్ళగొట్టండి నినాదంతో ఈ ఆందోళనలు చేపట్టామని, నిరుపయోగంగా ఉన్న సెజ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని, భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన అధిక సుంకాల రద్దుకు దౌత్య చర్చలు ముమ్మరం చెయ్యాలని కోరారు.

ఆత్మహత్య చేసుకుంటానని బంధువుకు ఫోన్‌చేసిన వ్యక్తి...

రక్షించి కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు

కైకలూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు కైకలూరు టౌన్ పోలీసులు చాకచక్యంగా అతన్ని పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు. శుక్రవారం కైకలూరు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా భీమడోలు మండలం తడికలపూడికి చెందిన అందుగల థామస్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం హాల్టింగ్ డ్రైవర్‌గా భీమవరం కిరాయికి వచ్చాడు. అతని మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో వరుసకు సోదరుడైన రత్నారావుకు ఫోన్ చేసి ఇంటి వద్ద గొడవలు జరుగుతున్నాయని, అవమానకరంగా ఉందని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో రత్నారావు 112కు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాడు. దీంతో భీమవరం, ఉండి, ఆకివీడు పోలీసులు అప్రమత్తమయ్యారు. అయినా ఆచూకీ లభించలేదు. కైకలూరు టౌన్ ఎస్సై ఆర్ శ్రీనుకు సమాచారం ఇవ్వగా ఆయన హెడ్‌కానిస్టేబుల్ నాగరాజుతో కలిసి భీమవరం నుంచి కైకలూరు వచ్చే బస్సులను తనిఖీ చేసి బస్సులో ప్రయాణిస్తున్న థామస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా తడికలపూడి గ్రామానికి చెందిన వ్యక్తిగా చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

నరసింగపాలెం పీఏసీఎస్ ఛైర్మన్‌గా పొన్నం

ఆగిరిపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నరసింగపాలెం పీఏసీఎస్ ఛైర్మన్‌గా పొన్నం వెంకట రామచంద్రరావు నియమితులైనట్లు శుక్రవారం బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు తెలిపారు. బీజేపీ తరఫున నరసింగపాలెం పీఏసీఎస్ ఛైర్మన్‌గా పొన్నం పేరును మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన సానుకూలంగా స్పందించి రామచంద్రరావుని నియమించినట్లు తెలిపారు. సభ్యులుగా మాదల రవి, పొన్నంపల్లి సుధీర్ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు తదితరులు వీరిని అభినందించారు.

యువకుడిపై దాడి

ముదినేపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు ఓ యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన ముదినేపల్లి మండలం గురజలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన పోకల భగవాన్, వీరిశెట్టి వెంకటేష్‌కు అదే గ్రామానికి చెందిన పామర్తి జశ్వంత్‌కు మధ్య పాత గొడవలతో కక్షలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ నెల ఏడవ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఆ గ్రామ సమీపంలోని కాల్వలో జశ్వంత్‌తో పాటు మరికొందరు యువకులు స్నానం చేస్తుండగా, వెంకటేష్‌తో కలసి వచ్చిన భగవాన్ గొడవ పెట్టుకుని తన వద్ద ఉన్న ఇనుప రాడ్డుతో జశ్వంత్ తలపై కొట్టి పారిపోయారు. గాయపడిన జశ్వంత్‌ను స్నేహితులు గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు, గడ్డివాము దగ్ధం

బాధితులకు ఏపీటీడీసీ డైరెక్టర్ చేయూత

ముదినేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకామనపూడిలో శుక్రవారం ఉదయం సంభవించిన అగ్ని ప్రమాదంలో పెరుమాళ్ళ ప్రసాద్ ఇల్లు, గడ్డివాము పూర్తిగా దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. సుమారు రెండు లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం సంభవించడంతో ఇంట్లోని ఫర్నిచర్ కూడా అగ్నికి ఆహుతైంది. దీంతో ఆ కుటుంబం నిరాశ్రయమైంది. సమాచారం అందుకున్న ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

సర్వే చేయకుండానే చేసినట్టు నివేదిక?

▸▸పంచాయతీ తీర్మానాన్ని అపహాస్యం చేశారన్న సర్పంచ్

ముదినేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చినకామనపూడి పంచాయతీకి చెందిన ఊర చెరువును సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని కోరుతూ పంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానానికి రెవెన్యూ అధికార్లు కనీస విలువ ఇవ్వలేదని ఆ పంచాయతీ సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య, పాలక వర్గ సభ్యులు విమర్శించారు. సర్వే చేయకుండానే సర్వే నిర్వహించినట్లు అధికార్లు తమకు ఒక నివేదిక పంపించడం పంచాయతీ తీర్మానాన్ని అపహాస్యం చేసినట్లయిందని శుక్రవారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశం తీవ్రంగా విమర్శించింది. చెరువును సర్వే చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాలను కూడా మండల రెవెన్యూ అధికార్లు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం సర్పంచ్ నాంచారయ్య విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పశువులకు తాగునీటి సౌకర్యం పెం చేందుకు 2.35 ఎకరాల విస్తీర్ణంలోని ఊర చెరువు పూడికతీత పనులు నిర్వహించాలని నిర్ణయించి చెరువును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని ఇటీవల పంచాయతీ తీర్మానాన్ని ఏలూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అందజేశామని, కలెక్టర్ కార్యాలయం నుంచి దీనిపై చర్యలు తీసుకోవాలని ముదినేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. సర్వే నిర్వహించకుండా, ఆక్రమణలు లేవని ధ్రువీకరిస్తూ ఈనెల 7న తనకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఒక ఎండార్స్‌మెంట్ వచ్చిందని సర్పంచ్ తెలిపారు. ఆ ఎండార్స్‌మెంటులో పంచాయతీ తెలిపిన సమస్య పరిష్కారమైందని, అయినా ఆ చెరువు పూడిక తీయించాల్సిన అవసరం లేదని పశువులకు సరిపడినంత నీటిని నింపేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ లతీఫ్ పాషా పేర్కొన్నారని చెబుతూ చెరువు విస్తీర్ణాన్ని సర్వే చేయాలని తాము కోరితే పంచాయతీ వ్యవహారాల్లోకి తహసీల్దార్ జోక్యం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీ తీర్మానానికి అనుగుణంగా చెరువు సర్వే నిర్వహించాలని సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ శ్రీలక్ష్మి, సభ్యులు డిమాండ్ చేశారు.



చినకామనపూడి పంచాయతీ సమావేశం



నూజివీడు ఏరియా ఆసుపత్రి



కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

హా..సుపత్రి!

(5వ పేజీ తరువాయి)

ఆరేళ్లగా నిర్మాణంలోనే ఉన్నాయి. ఇవి మంజూరై 13 సంవత్సరాలైనా అదిగో ఇదిగో అంటూ ఎదురుచూపులే.

కైకలూరులో టెక్నీషియన్లు లేరు.. పరీక్షలూ లేవు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో మొత్తం 14 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాలుగు కేంద్రాల్లో వైద్యాధికారుల కొరత ఉంది. మండవల్లి-1, గురజలో ఇద్దరు డాక్టర్లకు ఒకరు సెలవుపై వెళ్లారు. మూల్లలంక-1, కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు లేరు. కలిదిండిలోని డాక్టరు వారంలో మూడు రోజులపాటు కొల్లేటికోటలో విధులు నిర్వహిస్తున్నారు. ఇది కొల్లేరు గ్రామాల్లో ఉన్న ఏకైక పీహెచ్‌సీ కావడంతో పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప గ్రామాల్లోని ప్రజలంతా ఈ పీహెచ్‌సీకే వైద్య సేవల కోసం వెళుతుంటారు. వైద్యాధికారులు లేక ఆకివీడు, కైకలూరు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతనపల్లిలో ల్యాబ్ టెక్నీషియన్ లేక కోరుకొల్లు ఆస్పత్రి నుంచి వచ్చి వారంలో మూడు రోజులపాటు సీతనపల్లి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. మూల్లలంకలో ల్యాబ్‌టెక్నీషియన్ సెలవుపై వెళ్లారు. లోకుమూడి, కొల్లేటికోట, మండవల్లి ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్ లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా ల్యాబ్‌టెక్నీషియన్‌ల కొరత వేధిస్తోంది. వర్షాకాలం కావడంతో పరీక్షలు చేసే అవకాశం లేక రోగులంతా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మండవల్లి ఆస్పత్రిలో ఫ్లోరింగ్ దిగిపోయి అస్తవ్యస్తంగా మారింది. ఆస్పత్రి ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి. కలిదిండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం చుట్టూ ప్రహరీ లేక పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముదినేపల్లి పీహెచ్‌సీకి వెళ్లే రహదారి ఇరువైపులా దట్టంగా మొక్కలతో మూసుకుపోయింది. ఆ రహదారి ధ్వంసం అవడంతో రోగుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.